PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 71 | విజయవాడ, శనివారం 11 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No Vijayawada, Saturday 11 October 2025 Rs



టిసిఎస్‌లో 20వేల ఉద్యోగ కోతలు

3



తొలి రోజు టీమిండియాదే..!

- డబుల్ సెంచరీకి చేరువలో జైస్వాల్
- సాయి సుదర్శన్ అర్ధసెంచరీ
- భారత్ 318/2

8

కార్పొరేట్లకు రెడ్ కార్పెట్

1.17 లక్షల కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వ ఆమోదం

- భూ కేటాయింపులు... సబ్సిడీలు
- కేబినెట్ నిర్ణయాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కార్పొరేట్లకు యదేశ్చగా చేస్తున్న భూ కేటాయింపులు, ఇస్తున్న సబ్సిడీలపై ప్రజానీకంలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ వైఖరిలో ఏమాత్రం మార్పు రావడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలోనూ కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్ పరుస్తూ పలు నిర్ణయాలు తీసుకున్నారు. పెద్ద ఎత్తున భూ కేటాయింపులు చేశారు. సబ్సిడీలు చేశారు. వీటిలో పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టుల నుండి పర్యాటక పథకాల వరకు ఉన్నాయి. మొత్తం మీద 1.17 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. వీటి ద్వారా 78,771 ఉద్యోగాల వస్తాయని కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వివరించిన రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. అనకాపల్లి జిల్లాలో అధునాతన కార్బన్ కాంప్లెక్స్ తయారీ, పల్నాడు జిల్లాలో సిమెంట్ ప్లాంట్ గుడిపల్లి టేకులోడు (అనంతపురం జిల్లా)లో ఏరోస్పేస్ అండ్ ఆటోమేటివ్ కాంపోనెంట్ తయారీ పరిశ్రమల స్థాపనకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టుల వల్ల రూ.5,800కోట్ల పెట్టుబడిలక్ష్యంగా 6,646 మందికి ఉపాధి అవకాశాలు కలుగునున్నట్లు మంత్రి వెల్లడించారు. విజయనగరంజిల్లాలో జెఎస్‌డబ్ల్యు ఇండస్ట్రియల్ పార్క్ లిమిటెడ్ (ప్రైవేట్)కు రూ.1166.43ఎకారల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఈ కంపెనీకి ఎకరా రూ.3లక్షలు, క్యాపిటల్ సబ్సిడీ, భూమి మార్పిడి, వినియోగ మార్పు, లే అవుట్ ఆమోదం చార్జీల్లో వంద శాతం మినహాయింపునిస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. లూలూ గ్రూప్‌లో భాగమైన ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మల్లివల్లి మెగాఫుడ్ పార్క్‌లోని 7.48ఎకారల కోర్ ప్రాసెసింగ్ సెంటర్‌ను 66సంవత్సరాలకు సంవత్సరానికి రూ.50లక్షలకు లీజు వంతున, ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఐదు శాతం పెంచేందుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది.



మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

విజయనగరం పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు

విజయనగరం జిల్లా మక్కువ మండలం దుగ్గేరు వద్ద చింతగ్రీన్ ఎనర్జీ సంస్థ ఏర్పాటు చేయనున్న పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు చేసే ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. వెంగళరాయ సాగర్, తోటపల్లి ప్రాజెక్టుల నుండి 24 ఎంసిఎం నీటిని ఈ ప్రాజెక్టుకు కేటాయించారు. అదే విధంగా ఆవిరి నష్టాలకు 1.50 ఎంసిఎం నీటిని కేటాయించారు. ఈ ప్రాజెక్టు నుండి 40 సంవత్సరాలకు 1,230 కోట్లరూపాయలు విలువ చేసే గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి అవుతుందని అంచనా.

మిట్టల్ స్టీల్‌కు వడ్డీ మినహాయింపు

అనకాపల్లిలో రూ.55వేల కోట్లతో చేపడుతున్న ఆర్సిలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్‌కు రూ.12.58కోట్ల వడ్డీ మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాయుడు పేటలో కార్బన్ బ్లాక్ ప్లాంట్ కోసం పిసిబిఎల్ కెమికల్ లిమిటెడ్‌కు రూ.2,717 కోట్లతో సవరించిన పెట్టుబడి ప్రతిపాదన సర్దుభాటు చేసిన కాలపరిమితితో ఆమోదముద్ర వేసింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రప్రైన్యూర్స్ ఆఫ్ ఇండియా రూ.36.25కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న మహిళాశక్తి ఎస్టేట్‌కు ఎకరా రూ.10లక్షలకు 30ఎకరాలను కేటాయించారు. విశాఖపట్టణం గుర్రం పాలెంలో రూ.319 కోట్ల పెట్టుబడితో అవంతి వేర్ హౌసింగ్ మిగతా 7లో

ప్రభుత్వ బ్యాంకు పగ్గాలు ప్రైవేటుకు

అత్యున్నత స్థాయి పదవులు అప్పగించేందుకు కేంద్రం నిర్ణయం

- ఎస్‌బిఐ ఎమ్‌డితో ప్రారంభం
- ఇతర పిఎస్‌బిలలో ఇడిల నియామకాలు
- మార్గదర్శకాలు జారీ
- భగ్గుమన్న బ్యాంకింగ్ సంఘాలు



న్యూఢిల్లీ : నైపుణ్యం సాకుతో సివిల్ సర్వీసులోని అత్యున్నత స్థాయి ఉద్యోగాలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అస్మదీయులకు కట్టబెడుతున్న సంగతి తెలిసిందే. లేటరల్ ఎంట్రీ పేరుతో ఈ అడ్డగోలు విన్యాసానికి మోడీ సర్కారు పాల్పడుతోంది. తాజాగా అదే ప్రక్రియను బ్యాంకింగ్ రంగంలోనూ అనుసరించనుంది. ఈ మేరకు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని అత్యున్నత పదవులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రభుత్వ బ్యాంకుల పగ్గాలు ప్రైవేటు రంగానికి అప్పగించినట్టైంది. దేశంలోని అతి పెద్ద బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎస్‌బిఐలోని మేనేజింగ్ డైరెక్టర్ (ఎండి) పదవిలోకి ప్రైవేటు వ్యక్తులను తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. అదే విధంగా ఇతర పిఎస్‌బిల్లోనూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇడి) పదవులను కూడా ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టనుంది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్సియల్ సర్వీసెస్ (డిఎఫ్ఎస్)లోని అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ ది క్యాబినెట్ (ఎసిసి) మార్గదర్శకాలను జారీ చేసింది. వెంటనే ఆ ఉద్యోగాల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది, దీనిపై బ్యాంకింగ్ యూనియన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఎసిసి సవరించిన మార్గదర్శకాల ప్రకారం.. ఎస్‌బిఐ ఎండి పదవీ కోసం ప్రయివేటు సెక్టార్ అభ్యర్థులకు కనీసం 21 సంవత్సరాల వృత్తిపరమైన అనుభవం, అందులో 15 సంవత్సరాలు బ్యాంకింగ్‌లో, 2 సంవత్సరాలు బ్యాంక్ బోర్డు స్థాయిలో పని చేసి ఉండాలి. తదుపరి ఖాళీలు అంతర్గత పబ్లిక్ సెక్టార్ బ్యాంకు అభ్యర్థులచే భర్తీ చేయబడతాయి. ఇప్పటి వరకు ఎస్‌బిఐలో ఎండి పదవీని ఆ సంస్థలోని అర్హులైన అంతర్గత అధికారులతో భర్తీ చేసేవారు. ఇప్పుడు ఏళ్ల తరబడి ఎస్‌బిఐలోనే పనిచేసిన వారు సైతం ప్రైవేటు రంగానికి చెందిన వారితో పోటీ పడాల్సివస్తుంది. ఇతర పిఎస్‌బిల్లో ఇడి పోస్టుల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు 18 సంవత్సరాల అనుభవం, అందులో 12 సంవత్సరాలు బ్యాంకింగ్‌లో, 3 సంవత్సరాలు బోర్డు కంటే ఒక స్థాయి క్రింద అనుభవం ఉండాలి. ప్రతి బ్యాంకులో ఒక ఇడి పోస్టును మిగతా 5లో

వ్యవస్థాగత హత్య

- ఐపిఎస్ పూరణ్ కుమార్ మృతిపై వెల్లువెత్తుతున్న నిరసనలు
- నివేదిక ఇవ్వండి : జాతీయ ఎస్‌సి కమిషన్ ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి : సిపిఎం డిమాండ్

7



మచడోకి నోబెల్ శాంతి బహుమతి

- ట్రంప్‌పైనే ఆధారపడుతున్నాం : వెనిజులా నేత

7



మహారాష్ట్రలోని థానేలో ఆందోళన చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

మహారాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల పోరుబాట

- 72 గంటల సమ్మె ప్రారంభం
- కేంద్ర కార్మిక సంఘాల మద్దతు


ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విద్యుత్‌రంగం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మహారాష్ట్ర విద్యుత్ రంగ ఉద్యోగులు, ఇంజినీర్లు, అధికారులు పోరుబాట పట్టారు. ఉద్యోగులు, ఇంజినీర్లు, అధికారులు ఉమ్మడి కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు 72 గంటల రాష్ట్రవ్యాప్త సమ్మె గురువారం ప్రారంభమైంది. ప్రజలకు విద్యుత్‌ను చౌకగా అందించాల్సిన ప్రభుత్వాలు వారిపై భారాలు వేస్తూ... విద్యుత్ రంగాన్ని కారుచౌకగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన పోరాటానికి కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తపన్ సేన్ (సిఐటియు), అమర్జీర్ కౌర్ (ఎఐటియుసి), సంజీవ్ రెడ్డి (ఐఎన్‌టియుసి), సింధు (హెచ్ఎంఎస్), శివశంకర్ (టియుసిసి), మనాలి (ఎస్ఇడబ్ల్యుఎ), రాజీవ్ దిమారి (ఎఐసిసిటియు), అశోక్ ఘోష్ (యుటియుసి) తదితర నేతలు ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలను తొలుత బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అవలంభించిందని, ఇప్పుడు మిగతా 7లో

22 వరకు ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల ఫీజు గడువును ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఇంటర్మీడియట్ బోర్డు ఇన్‌ఛార్జి కార్యదర్శి భరత్ గుప్తా శుక్రవారం విడుదల చేశారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించే గడువు అక్టోబరు 10తో ముగియగా, దీనిని ఈ నెల 22 వరకు పొడిగించారు. ఈ నెల 22 వరకు రూ.1000 అపరాధ రుసుంతో చెల్లించే గడువును ఈ నెల 30 వరకు పొడిగించారు. మరోసారి ఫీజు చెల్లించే గడువు పొడిగించే అవకాశం ఉండదని వెల్లడించారు.



బయో ఎనర్జీకి ఉజ్వల భవిష్యత్తు..!

- నెల్లూరు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు, బయో ఎనర్జీకి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శుక్రవారం నెల్లూరు జిల్లాలోని వెంకటాచలం, ఈదగాలి గ్రామంలోని చింతా శశిధర్ ఫౌండేషన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్, నందగోకులం లైఫ్ స్కూల్, సేవ్ ద బుల్ ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2047 నాటికి ప్రపంచంలోనే భారత్ నెంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా మారుతుందని, అదే స్ఫూర్తితో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలుపుతామని అన్నారు. ఈదగాలి గ్రామంలో 24 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్ రోజుకు 200 కిలో లీటర్ల ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తోందన్నారు. దీని కోసం 15 వేల టన్నులకు పైగా పాడైన బియ్యం, నూకలు, పంట వ్యర్థాల కొనుగోలు ద్వారా రైతులకు మేలు జరుగుతోందన్నారు. రైతుల సంక్షేమంతో పాటు ఇథనాల్ తయారు చేస్తూ దేశ ప్రగతికి తోడ్పడుతున్నారన్నారు. పశుసంపదను, మన వారసత్వాన్ని కాపాడేందుకు థ్రెడ్‌మిల్ మిషన్‌పై ఎద్దులతో వ్యాయామం చేయిస్తూ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా నూతన ప్రయోగం చేయడం అభినందనీయమన్నారు. ఇక్కడి గోశాలలో సుమారు 400 పైగా పశు జాతులను సంరక్షిస్తూ మన వారసత్వ సంపదను ముందుకు తీసుకెళ్లడం గొప్ప విషయమని చెప్పారు. నంద గోకులం లైఫ్ స్కూల్ ద్వారా ప్రతిభ కలిగిన, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉత్తమ విద్యను అందిస్తున్న చింతాశశిధర్ ఫౌండేషన్‌ను సిఎం అభినందించారు. సమాజానికి తిరిగి ఇవ్వడం అనే కాన్సెప్ట్‌లో భాగమే పి4, డబ్బులు ఇవ్వడం ఒక్కటే కాదని, చేయూత ఇవ్వడమూ ముఖ్యమని అన్నారు. విశాఖపట్నం కేంద్రంగా రూ.88 వేల కోట్లతో గుగూల్ డేటా సెంటర్ ప్రారంభమవుతోందని, రాష్ట్ర భవిష్యత్తు మార్పునకు ఎంతో ఉపయోపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చెన్నై- అమరావతి, చెన్నై - హైదరాబాద్ మధ్య బుల్లెట్ రైలు ప్రతిపాదనలున్నాయని తెలిపారు. నెల్లూరు జిల్లాలో రామాయపట్నం పోర్టు వస్తుందని, వాకాడు వద్ద దుగరాజుపట్నం పోర్టు భవిష్యత్తులో రానుందన్నారు. దగదర్తి విమానా శ్రయాన్ని పూర్తి చేస్తామని సిఎం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఇంటూరు నాగేశ్వరరావు, కురుగుండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, కలెక్టర్ హిమాన్షు శుక్లా, విశ్వ సముద్ర చైర్మన్ చింతా శశిధర్, ఎమ్‌డి అనిల్‌కుమార్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.



బయోఎనర్జీ మిషన్ ప్రారంభిస్తున్న సిఎం

బిసి హాస్టల్‌లో 53 మంది విద్యార్థులకు అస్వస్థత

- గుంటూరు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

3

పొగాకు కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

ఖాళీగా 30 వేల ఎకరాలు

- సేకరించిన భూములన్నీ నిరుపయోగంగానే...
- వాన్‌పిక్ ప్రాజెక్టు కోసం తీరప్రాంతంలో వేలాది ఎకరాలు
- కనిగిరి, దొనకొండ పారిశ్రామికవాడల్లోనూ ఇదే పరిస్థితి
- ఎక్కడా ఒక్క పరిశ్రమ పెట్టిన దాఖలాలు లేవు
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉపాధి కల్పన మాటలకే పరిమితం



ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

పరిశ్రమల కోసం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సేకరించిన దాదాపు 30 వేల ఎకరాల భూములు ఏళ్ల తరబడి నిరుపయోగంగానే పడి ఉన్నాయి. ఆఘమేఘాలపై భూములను సేకరించారు. రైతుల అభ్యంతరాలను పట్టించుకోలేదు. ఎన్నికల్లో హామీలు ఇవ్వడం తప్ప, ఎక్కడా ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. ఉపాధి కల్పన ఎండమావిగానే మారింది. విదేశీ కంపెనీలు వస్తాయని, వేలాది మందికి ఉపాధి కలుగుతుందని చెప్పిన మాటలన్నీ నీటిమూటలయ్యాయి.

15 ఏళ్లుగా వాన్‌పిక్ భూములు అలాగే...

ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉన్న సమయంలో ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో వాన్‌పిక్ ప్రాజెక్టు తెరపైకి వచ్చింది. తీరప్రాంతంలో పరిశ్రమల కారిడార్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఓడరేవు, పరిశ్రమలను ప్రతిపాదించారు. అరబ్ దేశానికి చెందిన రసాల్‌ఖైమా అనే సంస్థతో ఒప్పందాలు చేసుకున్నారు. సుమారు 22 వేల ఎకరాల్లో పెట్టుబడులు వస్తాయని, తీరప్రాంతం పరిశ్రమలు, ఉపాధితో భారీ ఎత్తున అభివృద్ధి చెందుతుందని ఆశలు చూపారు. తీరప్రాంతంలో కొత్తపట్నం మండలం మొదలు గుంటూరు జిల్లా నిజాంపట్నం వరకూ భూములను సేకరించారు. ప్రకాశం జిల్లాలోనే ఇందులో సుమారు 14 వేల ఎకరాలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ భూములు ఎనిమిది వేలు ఎకరాలు, పట్టా భూములు ఆరు వేల ఎకరాలు. అప్పటి ప్రభుత్వం దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో అప్పటి కలెక్టర్ దేవానంద్ ప్రత్యేక దృష్టి సారించి ఆఘమేఘాలపై భూములను సేకరించారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ నేతలు గ్రామాల్లో బలవంతంగా భూములను సేకరించే ప్రక్రియకు సహకరించారు. పేదల సాగులో ఉన్న ప్రభుత్వ భూములను అధికారులు బలవంతంగా లాగేసుకున్నారు. సాగుదార్లకు కొద్ది మొత్తంలో ఆనాడు పరిహారం ఇచ్చారు. పట్టా భూములను ఎకరా ఒక్కంటికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు మాత్రమే ఇచ్చి బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. వాన్‌పిక్‌ను నిమ్మగడ్డ ప్రసాద్ అనే పారిశ్రామికవేత్త నిర్వహించారు. ఈ మిగతా 5లో

జిల్లాలో వివిధ సంస్థల కింద ఉన్న భూములు

- వాన్‌పిక్ ప్రాజెక్టు కింద 14 వేల ఎకరాలు
- దొనకొండ పరిశ్రమల కేంద్రంలో 2,395.98 ఎకరాలు
- కనిగిరి నిమ్జ్ కింద ఉన్న భూములు 4,364.66 ఎకరాలు

నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు జనార్ధనరావు అరెస్టు

ప్రజాశక్తి- గన్నవరం (ఉంగుటూరు)

ములకలచెరువు, ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్ధనరావును శుక్రవారం సాయంత్రం గన్నవరం విమానాశ్రయంలో పోలీసులు అరెస్టు చేశారు. సౌతాఫ్రికా నుంచి ముంబయికి, అక్కడ నుండి ఎయిర్ ఇండియా విమానంలో గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన ఆయనను పోలీసులు అరెస్టు చేసి భవానీపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నకిలీ మద్యం కేసులో ఆయన ఎ-1 నిందితుడిగా ఉన్నారు.



గన్నవరం విమానాశ్రయంలో పోలీసులు అరెస్టు చేసిన జనార్ధనరావు

నాలుగు వారాల్లో తేల్చిచెప్పండి

జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై కేంద్రానికి సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడంపై నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్రాన్ని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన బెంచ్ ఈ మేరకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశాలిచ్చింది. ఇటువంటి నిర్ణయం తీసుకునేటప్పుడు పహల్గాం ఉగ్రదాడితో సహా పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి వుందని బెంచ్ అంగీకరించినప్పటికీ పిటిషనర్ల వాదనలపై స్పందించాల్సిందిగా కేంద్రాన్ని ఆదేశించింది. నిర్దిష్ట కాలపరిమితిలో (రెండు మాసాల్లోగా) రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కోరుతున్న పిటిషన్‌పై విచారణ సందర్భంగా బెంచ్ పై ఉత్తర్వులు జారీ చేసింది. భారత సమాఖ్య వ్యవస్థకు ఎదురయ్యే రాజ్యాంగ పర్యవసానాలను పరిశీలించాల్సిందిగా సుప్రీంకోర్టును పిటిషనర్లు కోరారు. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామన్న హామీని గౌరవిస్తూ చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్రంపై పిటిషనర్లు ఒత్తిడి తెచ్చారు. కేంద్ర పాలిత ప్రాంత హోదా కొనసాగడం వల్ల సమాఖ్యవాదం ఆలోచనే దెబ్బతింటోందని అన్నారు. భారత రాజ్యాంగం మౌలిక అంశమే ఇదని వారు స్పష్టం చేశారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఏకకాలంలో సజావుగా సాగాయంటేనే రాష్ట్ర హోదాకు అడ్డుపడే భద్రతా పరమైన అంశాలు, ఆందోళనలు లేవని అర్థమవుతోందని వారు తమ పిటిషన్లలో పేర్కొన్నారు. ఎంఎల్ఎ ఇర్ఫాన్ హాఫీజ్ తరపున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి వాదనలు వినిపిస్తూ, రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామన్న హామీ కేవలం రాజకీయ ప్రకటన కాదని, రాజ్యాంగ న్యాయస్థానం ముందు కేంద్రం ఇచ్చిన వ్యవస్థాగతమైన హామీ అని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించకుండా ఉండటం చెడు సాంప్రదాయమని అన్నారు. ఒక రాష్ట్రాన్ని ఈ విధంగా కేంద్ర పాలిత ప్రాంతంగా కుదించగలిగితే భారత సమాఖ్యవాదానికి అర్థం ఏమిటనే ప్రశ్నను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. గత ఏడాది అక్టోబర్ 18న ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని జమ్మూకాశ్మీర్ మంత్రివర్గం రాష్ట్రహోదా పునరుద్ధరించాలని కోరుతూ చేసిన తీర్మానాన్ని కూడా ఆమె ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.

పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ వాదనలు వినిపిస్తూ... ఎన్నికల తరువాత రాష్ట్రహోదా పునరుద్ధరిస్తామని సొలిసిటర్ జనరల్ 2023 డిసెంబర్‌లో హామీ ఇవ్వడం వల్లే సుప్రీంకోర్టు ఆ మిగతా 5లో

మంత్రులపై సిఎం అసహనం ?

- చేసినవి కూడా చెప్పడం లేదంటూ అసంతృప్తి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

మంత్రులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరోసారి అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన విడిగా సహచర మంత్రులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అనేక అంశాలను సిఎం ప్రస్తావించారు. ఆ సమయంలోనే మంత్రుల పనితీరుపై కూడా ఆయన మాట్లాడినట్లు తెలిసింది. శాఖలను, ప్రభుత్వాన్ని నడపాల్సింది మంత్రులే అని అధికారులు కాదని సిఎం అన్నట్లు సమాచారం. మంత్రుల పనితీరు సక్రమంగా లేదని, పనితీరులో మరింత వేగం పెంచాలని స్పష్టం చేశారు. అధికారులు మంత్రులకు కార్యక్రమాలపై చెబుతుంటారని, అయితే వాటిని పర్యవేక్షించాల్సింది మంత్రులు మాత్రమేనని ఆయన అన్నట్లు తెలిసింది.

అధికారులు సక్రమంగా పనిచేయకపోతే వారిని మందలించి, పనిచేయించాల్సిన బాధ్యత కూడా మంత్రులదేనని అయన అన్నారు. ఆర్థికంగా ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం అనేక పనులు చేసిందని, అయితే,వాటిని ప్రజలకు వివరించడంలోనూ మంత్రులు విఫలమవుతున్నారని సిఎం అన్నట్లు సమాచారం, ఈ సందర్భంగా విద్యుత్ చార్జీలకు సంబంధించి ట్రూ డౌన్ అంశాన్ని ఆయన ప్రస్తావించినట్లు తెలిసింది. దీనివల్ల 980



కోట్ల వరకు మేలు జరిగిందని, దీనిని కూడామంత్రులు ప్రజలకు చెప్పలేదని సిఎం అన్నట్లు సమాచారం.

ఇక రుర్బన్ పంచాయితీలు

రాష్ట్రంలోని పంచాయితీలను పట్టణ ప్రాంతాల్లో కలుపుతూ రుర్బన్ పంచాయితీలుగా మార్పు చేసే అంశాన్ని పరిశీలించాలని కూడా మంత్రులకు సిఎం సూచించినట్లు తెలిసింది. దీనివల్ల అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. అలాగే పారిశుధ్య కార్మికుల పోస్టుల పేర్లను కూడా మార్చేందుకు ఆలోచన చేయాలని సూచించారు.

విశాఖపట్నాన్ని రానున్న కాలంలో ముంబయి స్థాయి నగరంగా మార్చనున్నామని చెప్పారు. ఇప్పటికే విశాఖలో గూగుల్, రైల్వేజోన్‌లు వచ్చాయని, విశాఖ ఉక్కు మూతపడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

వీటితో 2028 నాటికి విశాఖలో ఐటి రంగంలో లక్షలాది ఉద్యోగాలు రానున్నాయని, ఆ సమయానికి విశాఖ మరో ముంబాయి స్థాయికి చేరుకుంటుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో వర్క్ ఫ్రమ్ హెూంలో పనిచేస్తున్న వారు 4.7 లక్షల మంది వరకు ఉన్నారని, ఈ సంఖ్యను 10 లక్షలకు పెంచాలని నిర్దేశించారు.

కులం, మతం పేరుతో చిచ్చు : లోకేష్

రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు కుల, మత చిచ్చులు రేపేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిపై కఠినంగా వ్యవహరించాలనిమంత్రి లోకేష్ అన్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి నివాసంలో మంత్రులతో నిర్వహించి బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో చిత్తూరులో అంబేద్కర్ విగ్రహాన్ని వైసిపి సర్పంచ్ దగ్ధం చేసిన అంశంపై మాట్లాడుతూ ఘటన అనంతరం కేసు పెడితే వాళ్లే ఆందోళన చేస్తున్నారని ఆక్షేపించారు. అక్కడికి వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించాలని హెూంమంత్రి అనితకు లోకేష్ సూచించారు. దక్షిణాఫ్రికాలోని కెమరూన్‌లో మాజీ ముఖ్యమంత్రి జగన్ సోదరుల డిస్టిలరీలను అక్కడి అధికారులు సీజ్ చేసిన అంశంపై చర్చ జరిగింది. దీనిని కూడా జనంలోకి తీసుకువెళ్లాలని లోకేష్ సూచించారు.

ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేత

- ఉసూరుమంటూ వెనుదిరుగుతున్న రోగులు
- బకాయిలు చెల్లిస్తేనే సేవల కొనసాగింపు : విజయకుమార్

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలని నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఎపి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పలు నెట్‌వర్క్ ఆస్పత్రులు శుక్రవారం నుంచి సేవలను నిలిపివేశాయి. వైద్యం కోసం వచ్చిన పలువురు రోగులు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు.

తమకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించిన తర్వాతే వైద్య సేవలను కొనసాగిస్తామని ఆస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. విశాఖలో 62 ఆస్పత్రుల్లో 27 ఆస్పత్రులు వైద్య సేవలను నిలిపివేశాయి. మిగితా 35 ఆస్పత్రుల్లో సేవలు కొనసాగుతున్నాయి. విశాఖలోని మొత్తం 62 ఆస్పత్రులకు సుమారు రూ.145 కోట్ల మేర బకాయిలు ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. నెల్లూరులో పదిహేను ఆస్పత్రులు వైద్య సేవలను నిలిపివేశాయి. ఎన్‌టిఆర్ జిల్లాలో తొమ్మిది, కృష్ణాజిల్లాలో రెండు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. దీంతో వైద్యం కోసం వచ్చిన రోగులు వెనుతిరిగి వెళ్లారు. ప్రస్తుతం ఇన్ పేషెంట్లుగా ఉన్న వారికి మాత్రం వైద్య సేవలు కొనసాగుతున్నాయి. అత్యవసరమైనా కొత్తగా ఎవరినీ ఆయా ఆస్పత్రుల్లో చేర్చుకోవడంలేదు. ఎన్‌టిఆర్ జిల్లాలో మొత్తంగా 60 ఆస్పత్రుల్లో వైద్య సేవలు అమలవుతున్నాయి. కృష్ణాజిల్లాలో మొత్తం 28 నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెండు ఆస్పత్రుల్లో వైద్య సేవలను నిలిపివేశారు. ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ కుమార్ తెలిపారు.

తప్పనిసరి పరిస్థితుల్లోనే బంద్‌కు దిగాల్సి వచ్చిందని చెప్పారు. తక్షణం రూ.600 కోట్లు విడుదల చేయాలని కోరారు. అత్యవసర సేవలనైనా అందించాలని అసోసియేషన్‌ను కోరినట్లు ఆరోగ్య శ్రీ ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల కో ఆర్డినేటర్లు డాక్టర్ సుమన్, ఎస్.బి.సతీష్ కుమార్ తెలిపారు. మచిలీపట్నంలోని ఆంధ్రా ఆస్పత్రి, గుడివాడలోని అన్నపూర్ణ ఆస్పత్రి మినహా మిగతా ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని సతీష్ కుమార్ చెప్పారు. ఈ రెండు ఆస్పత్రుల్లో కూడా అత్యవసర సేవలు కొనసాగుతున్నాయని, మిగిలిన వైద్య సేవలనే తాత్కాలికంగా నిలిపివేశారని తెలిపారు.

తిరుపతి హౌసింగ్ ఎఇ సస్పెన్షన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా తిరుపతిలో పనిచేస్తున్న పి దయాకర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దయాకర్ నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న సమయంలో కొడ్లపూడి, వెంకటేశ్వరపురం లే అవుట్లలో దశలవారీ డీవియేషన్ల ద్వారా అదనపు చెల్లింపులకు సిఫార్సు చేయడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారన్నారు.

పేర్ని నాని పిటిషన్‌పై వాదనలు పూర్తి

ప్రజాశక్తి-అమరావతి

మచిలీపట్నంలో వైసిపి బిల్డింగ్‌కు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను మున్సిపల్ అధికారులు జారీ చేసేలా ఉత్తర్వులివ్వాలంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు పూర్తయ్యాయి. తీర్పును తర్వాత వెలువరిస్తామని హైకోర్టు ప్రకటించింది. ఈ మేరకు జస్టిస్ నూనెపల్లి హరినాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. వైసిపి బిల్డింగ్‌కు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చేలా అధికారులకు ఆదేశాలివ్వాలంటూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పేర్ని నాని పిటిషన్ దాఖలు చేశారు. న్యాయవాది యర్రంరెడ్డి నాగిరెడ్డి వాదిస్తూ.. అన్ని అనుమతులు తీసుకున్నాకే భవన నిర్మాణం జరిగిందన్నారు. భవన నిర్మాణంలో లోపాలున్నాయని మున్సిపల్ కార్పొరేషన్ తరపున న్యాయవాది ఎఎస్‌సి బోస్ ప్రతివాదన చేశారు.

గత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే పిపిపి విధానం

- మెడికల్ కళాశాలలపై టిడిపి నేత పట్టాభి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెడికల్ కళాశాలల పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి)పై గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉత్తర్వులు ప్రకారమే ముందుకు వెళ్తున్నామని టిడిపి అధికార ప్రతినిధి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జిఒ 108ను తీసుకొచ్చారని, దీనికి విరుద్ధంగా తాము చేయడం లేదన్నారు. ఈ విషయంపై జగన్ వద్ద సమాధానం లేదన్నారు. పిపిపి విధానం సరైందని నేషనల్ మెడికల్ కమిషన్ ఛైర్మన్ చెప్పారని, దీనిని ఖండించగలవా? అని జగన్‌ను ప్రశ్నించారు. మెడికల్ కళాశాల గురించి వైసిపి దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మబోరన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పారిశ్రామికాభి వృద్ధిపై దృష్టి పెట్టారని టిడిపి కార్యానిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం తెలిపారు. ప్రతియేటా మెగా డిఎస్‌సి నిర్వహిస్తామని జగన్ తన హయాంలో హామీ ఇచ్చి విస్మరించారని ఆరోపించారు.

కెజిబివి విద్యార్థిని మృతి

- పాఠశాల ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - బ్రహ్మ సముద్రం

అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం కెజిబివి విద్యార్థిని శుక్రవారం మృతి చెందారు. తమ కూతురు అనారోగ్యంతో బాధపడుతుంటే సరైన సమాచారం ఇవ్వకపోవడంతోనే మరణించిందని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. మృతురాలి కుటుంబసభ్యులు, అధికారులు తెలిపిన వివరాల మేరకు.. బ్రహ్మసముద్రం మండల పరిధిలోని పడమటి కోడిపల్లి గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన దంపతులు గొల్ల మహేష్, ఈరక్కకు కుమార్తె చందన (14) ఉన్నారు. బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్నారు. దసరా సెలవుల అనంతరం తిరిగి పాఠశాలకు వచ్చిన చందనకు గురువారం రాత్రి ఛాతిలో నొప్పి ఉందని స్నేహితులకు చెప్పడంతో వారు తమ వద్ద ఉన్న టాబ్లెట్‌ను ఇచ్చారు. ఆ తర్వాత ఎస్ఒ మహాలక్ష్మికి సమాచారమిచ్చారు. ఆమె విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారమివ్వడంతో శుక్రవారం పాఠశాల వద్దకు వచ్చి తమ కూతురును తీసుకుని బ్రహ్మసముద్రం ప్రభుత్వాస్పత్రికి తీసుకు వెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కళ్యాణదుర్గం ఆర్‌డిటి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందారు. విద్యార్థిని మృతి వార్త తెలుసుకున్న ఎంఇఒలు ఓబుళపతి, కృష్ణా నాయక్ పాఠశాలను సందర్శించి ఆరా తీశారు.



కెజిబివి ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థి బంధువులు



చందన (ఫైల్‌ఫోటో)

విద్యార్థిని మృతికి కెజిబివి ఎస్ఒ, సిబ్బందే కారణమని ఆరోపిస్తూ మృతురాలి కుటుంబసభ్యులు కెజిబివి పాఠశాల ముందు శుక్రవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. ఎస్ఒ స్థానికంగా లేకపోవడంతోనే తమ కూతురు అనారోగ్యం విషయం ఆలస్యంగా చెప్పారన్నారు. చందన మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపు నాలుగు గంటల పాటు పాఠశాల ముందు బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి బాధితులతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'పిఎండిడికెవై'కు 4 జిల్లాలు ఎంపిక

- రాష్ట్ర, జిల్లా కమిటీలు నియామకం
- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజన (పిఎండిడికెవై) పథకంలో భాగంగా రాష్ట్రంలో నాలుగు జిల్లాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఎంపికైన జిల్లాల్లో శ్రీ సత్యసాయి, అనంతపురం, అల్లూరి సీతారామరాజు, అన్నమయ్య ఉన్నాయి. ఈ పథకాన్ని శనివారం ప్రధాన మంత్రి మోడీ ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర సమితి (కమిటీ) ఛైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సభ్య కార్యదర్శిగా వ్యవసాయశాఖ కార్యదర్శి, సభ్యులుగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, మత్స్య, పశుసంవర్ధకశాఖ, జలవనరుల శాఖ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల కార్యదర్శులు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం, ఎపి మత్స్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్లను, ఎస్ఎల్‌బిసి కన్వీనర్, నాబార్డు ప్రతినిధి, వ్యవసాయశాఖ డైరెక్టర్, ప్రభుత్వం ప్రతిపాదించిన కో-ఆప్షన్ సభ్యులను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎంపిక చేసిన జిల్లాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సమితి ఏర్పాటు చేయాలన్నారు. అందులో జడ్‌పి సిఇఒ, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశుసంవర్ధకశాఖల జెడిలు, సహకార శాఖ జిల్లా రిజిస్ట్రార్, డిపిఒ, జలవనరులశాఖ ఇఇ, లీడ్ బ్యాంకు జిల్లా అధికారి, నాబార్డు ప్రతినిధి, కెవికె ప్రధాన సైంటిస్ట్, కేంద్రం ప్రతిపాదించిన ఇద్దరు రైతులు, కిసాన్ సమృద్ధి కేంద్ర ప్రతినిధి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులను జిల్లా కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ కమిటీలో పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విదేశాల్లో ఉన్నట్లే ఉండాలి

- ఇళ్లముందు ప్రహరీగోడలు వద్దు
- అమరావతి రైతులకు సిఆర్‌డిఏ అధికారుల సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నూతనంగా నిర్మితమవుతున్న అమరావతి రాజధానిలో నిర్మాణాలు చేపట్టబోయే ఇళ్లకు ప్రహరీగోడలు కట్టకూడదని, విదేశాల్లో ఉంటున్న విధంగా ఇళ్లను నిర్మించుకోవడంతోపాటు గ్రీనరీకి ప్రాధాన్యత ఇవ్వాలని సిఆర్‌డిఏ అధికారులు రైతులకు సూచించారు. నిర్ణీత సైజు ప్లాట్లను పొందిన రైతులు ఖచ్చితంగా కాలనీల వారీగా ఇటువంటి నిబంధనలు అమలు చేయాలని సూచించారు. అమరావతిలో గ్రీనరీ అభివృద్ధి, పర్యాటకం తదితర అంశాలపై రాజధాని రైతులతో సిఆర్‌డిఏ అధికారులు శుశుక్రవారం సమావేశం నిర్వహించారు. పర్యాటకానికి సంబంధించిన మ్యాపును చూపించి దానిలో ఎక్కడ ఏమి నిర్మిస్తారో వివరించారు. ఎల్‌పిఎస్ లే అవుట్లను అభివృద్ధి చేస్తున్నామని, ఇళ్లను నిర్మించుకునేవారు ఇంటికి ఎదురుభాగంలో ప్రహరీగోడలు నిర్మించకూడదని సూచించారు. మొత్తం పర్యావరణ హితంగా ఉండాలని, విదేశాల్లో అధ్యయనం చేసిన తరువాత ఈ నిర్ణయం తీసుకున్నామని రైతులకు చెప్పారు. అలాగే కృష్ణానది లంకల్లో పర్యాటక ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని, అక్కడకు వచ్చేవారికి నగరంలో ఆహ్లాదం, ఆనందం ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. దీనికి అనుసంధానంగా కరకట్ట నుండి కృష్ణానది మధ్యలో హోటళ్లు, ఆహ్లాదభరిత వ్యాపార కేంద్రాలు, కన్వెన్షన్ సెంటర్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. భవానీద్వీపం మాదిరిగా అన్ని లంకల్లోనూ పర్యాటక ప్రాజెక్టులు వస్తాయని తెలిపారు. ఇళ్లముందు, చుట్టుపక్కల ఖాళీస్థలంలో మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇప్పుడున్న రోడ్లలో చెట్ల పెంపకం బాధ్యతను గ్రామాలవారీగా తీసుకోవాలని సూచించారు. ఆధునిక పద్ధతుల్లో రోడ్లను నిర్మిస్తున్న నేపథ్యంలో ఏ మార్గంలో ఏది కేటాయిస్తే దానికే వినియోగించాలని తెలిపారు. నడకమార్గంలోకి వాహనాలు రాకూడదని, వాహనమార్గంలోకి పాదచారులు వెళ్లకూడదని సూచించారు. రాజధాని ప్రాంతంలో నివశిస్తున్న వారు దీన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. అయితే ప్రాజెక్టుపై పలువురు రైతులు వ్యక్తం చేసిన అనుమానాలకు అధికారులు సమాధానాలు దాటవేశారు. అసలు ప్లాట్లే ఇవ్వకుండా ఎక్కడున్నాయో చెప్పకుండా గ్రీనరీ, నిబంధనలు అనడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు.

పే స్కేల్ జీతాలు చెల్లించాలి

- మంత్రి అనగానికి ఎపి విఆర్‌ఎ సంఘం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విఆర్‌ఎలకు పే స్కేల్ జీతాలు చెల్లించాలని ప్రభుత్వానికి ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ బందగి సాహెబ్, కె ఉమామహేశ్వరరావు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు పలు విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణలో గత మూడేళ్లుగా పే స్కేల్ జీతాలు చెల్లిస్తున్నారన్న విషయాన్ని తెలియజేశారు. గత ఎనిమిదేళ్లుగా జీతాలు పెరగలేదని, పెరిగిన ధరలతో కుటుంబాలు సతమత మవుతున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విధించిన నైట్ డ్యూటీలు రద్దు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సిఐటియు నాయకులు బి ముత్యాలరావు, పి శ్రీనివాసరావు ఉన్నారు. అనంతరం నేతలు మీడియాతో మాట్లాడుతూ.. విఆర్‌ఎల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా లేనందున ఈ నెల 13, 14 తేదీల్లో విజయవాడ అలంకార్ సెంటర్‌లో రిలే నిరాహార దీక్షలు, 15న జరగనున్న మహాధర్నాలో విఆర్‌ఎలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రానికి 3 ఆయుష్ కళాశాలలు

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కొత్తగా రెండు ఆయుర్వేద, ఒక యూనాని వైద్య కళాశాల రాబోతున్నట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. విజయవాడలోని ఎన్‌టిఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆయుష్ వైద్య విద్యార్థులు ఆత్మీయ సత్కారం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుష్ వైద్య సేవల విస్తరణ, మెరుగు కోసం రూ.166 కోట్లు మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. 6 జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ ఆస్పత్రులు కూడా ఏర్పాటు కాబోతున్నాయని పేర్కొన్నారు.

టెక్స్‌టైల్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో టెక్స్‌టైల్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు. అమెల్ సి ఆల్ట్ కాన్సార్టియం ప్రతినిధులు సచివాలయంలో మంత్రిని శుక్రవారం కలిశారు. హిందూపురంలోని ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్స్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తితో ఉన్నట్లు కంపెనీ ప్రతినిధులు చక్రవర్తి, సతీష్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సృష్టించిందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను తక్షణమే అందజేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా నూతన టెక్స్‌టైల్ పాలసీని తీసుకురావడంతో ఈ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఏర్పడిందన్నారు.

ట్రస్ట్ విధానంలోనే ఎన్‌టిఆర్ వైద్య సేవ అమలు

- కాంగ్రెస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ట్రస్ట్ విధానంలో ప్రభుత్వమే ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకాన్ని నిర్వహించాలని, నెట్వర్క్ ఆస్పత్రులకు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేటు ఆరోగ్య బీమా ముసుగులో.. ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకాన్ని పూర్తిగా నిస్తేజ పరుస్తుందన్నారు. రూ.2,700 కోట్లు నెట్వర్క్ ఆస్పత్రులకు బకాయిలు పెట్టడం పథకాన్ని ఎత్తేసేందుకు కుట్రగా అభివర్ణించారు. ఈ ఏడాదిలో నెట్వర్క్ ఆస్పత్రులు రెండు సార్లు సమ్మెకు దిగడం ప్రజారోగ్యంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో తెలియజేస్తుందన్నారు. ఏడాదికి ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకానికి రూ.4 వేల కోట్లు ఖర్చు పెట్టడానికి మనసు రాని ప్రభుత్వానికి, బీమా సంస్థలకు వేల కోట్లు ఎలా దోచిపెడుతున్నారని ప్రశ్నించారు.

విఒఎల సమస్యలు పరిష్కరిస్తాం

- యూనియన్ నాయకత్వంతో మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ సంఘ సహాయకుల (విఒఎ) న్యాయమైన డిమాండ్లను త్వరలోనే పరిష్కరిస్తామని గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సచివాలయంలో మంత్రిని ఎపి వెలుగు ఉద్యోగుల (యానిమేటర్స్) యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రూపాదేవి, కె ధనలక్ష్మి తదితరులు మంత్రిని శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా కాలపరిమితి సర్క్యులర్ అమలు నిలుపుదల చేస్తూ నిర్ణయం తీసుకున్నందుకు మంత్రికి అభినందనలు తెలిపారు. ధనలక్ష్మి మాట్లాడుతూ.. విఒఎలు రకరకాల యాప్‌లకు సంబంధించి ప్రజల నుంచి వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపించాల్సి వస్తుందన్నారు. ఈ విధులు నిర్వహించడానికి సెల్‌ఫోన్‌లు సక్రమంగా పని చేయకపోవడం వల్ల యానిమేటర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మహిళా మార్టులను రద్దు చేయాలని కోరారు. వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పిస్తూ హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. అనంతరం మంత్రి శ్రీనివాస్ స్పందిస్తూ.. కొత్త సెల్‌ఫోన్‌లు రెండు నెలల్లో మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళా మార్టులు అనుభవజ్ఞులైన వారితో నిర్వహించే అంశంపై పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. విఒఎల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కాలపరిమితి సర్క్యులర్ నిలుపుదల చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను మంత్రి.. యూనియన్ నాయకులకు అందజేశారు. మంత్రి హామీతో అక్టోబరు ఒకటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిలుపుదల చేసిన ఆన్‌లైన్ వర్కులను శనివారం నుంచి యథావిధిగా కొనసాగిస్తామని యూనియన్ నాయకత్వం పేర్కొంది. మంత్రిని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర నాయకులు తిరుపతి, స్వరూప, వెంకటలక్ష్మి, సుభాషిణి, గోవిందమ్మ, నాగలక్ష్మి, మరియమ్మ తదితరులు ఉన్నారు.

కోర్టు ఆదేశాల్ని అమలు చేయడం లేదు

- పోలీసులపై కోర్టు ధిక్కరణ పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

ప్రకాశం జిల్లాలోని శ్రీసిద్ధి భైరవేశ్వరస్వామి ఆలయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదనే ఆదేశాలను రాచర్ల పోలీసులు అమలు చేయడం లేదంటూ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ శ్రీరంగారెడ్డి పిటిషన్ వేశారు. అధికార పార్టీకి చెందిన వారు జోక్యం చేసుకుంటున్నారంటూ ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. రాచర్ల ఎఎస్ఐ పై ఆదిశేషయ్య కోర్టు ఆదేశాల్ని ఖాతరు చేయడం లేదన్నారు. ఆదిశేషయ్యకు హైకోర్టు నోటీసులు జారీ చేసి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ప్రకాశం జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు, డిఎస్‌పి యు నాగరాజు, రాచర్ల ఎస్‌హెచ్ఒ పి కోటేశ్వరరావుపై మరో కోర్టు ధిక్కార పిటిషన్ కూడా దాఖలు చేశారు. దీనిని కూడా హైకోర్టు వచ్చేవారం విచారణ చేసే అవకాశముంది. గత జూన్ 19న ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు దానిపై కేసు నమోదు చేయలేదని పిటిషనరు వాదించారు.

వైద్య రంగాన్ని దెబ్బతీస్తున్నారు

- మాజీ మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వైద్య రంగాన్ని, ఎన్‌టిర్ వైద్యసేవ పథకాన్ని దెబ్బతీస్తున్నారని మాజీ మంత్రి విడదల రజిని విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఒకవైపు ఆస్పత్రులను ప్రైవేటీకరిస్తున్నారని, మరోవైపు ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్కు ఆస్పత్రులకు బకాయిలు ఇవ్వడం లేదని తెలిపారు. దీంతో చికిత్సలు చేయలేమంటూ ఆ ఆస్పత్రులు ప్రభుత్వానికి లేఖ రాశాయన్నారు. గతంలోనూ ఇలాగే చెబితే డబ్బులు ఇస్తామంటూనే ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ విషజ్వరాలు పెరుగుతున్నాయని, తీవ్రమైన వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. అయినా ప్రభుత్వంలో చలనం లేదని పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలతో ఎవరైనా మరణిస్తే అవి ప్రభుత్వ మరణాలుగానే పరిగణించాలన్నారు.

30 శాతనికి తగ్గకుండా ఐఆర్ ఇవ్వాలి

దీపావళి నాటికైనా ఉద్యోగులకు నాలుగు డిఎలు, 30 శాతానికి తగ్గకుండా ఐఆర్ ఇవ్వాలని, రూ.30 వేలకోట్ల బకాయిలు తక్షణమే విడుదల చేయాలని వైసిపి ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షులు నలమారు చంద్రశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు.

90 శాతం సబ్సిడీపై పప్పు శనగ విత్తనాలు

- ఎపి రైతు, కౌలు రైతు సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రబీలో రైతులకు 90 శాతం సబ్సిడీపై తక్షణమే పప్పు శనగ విత్తనాలు ప్రభుత్వమే సరఫరా చేయాలని ఎపి రైతు, కౌలు రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ నెల ఒకటి నుంచి రబీ సీజన్ ప్రారంభమైందని, రాష్ట్రంలో అనంతపురం, కర్నూలు, నంద్యాల, కడప, ప్రకాశం జిల్లాల్లో రైతులు రబీ పంటగా పప్పు శనగ విస్తారంగా సాగు చేస్తున్నారని ఆయా సంఘాల ప్రధాన కార్యదర్శులు కె ప్రభాకర్ రెడ్డి, ఎం హరిబాబు శుక్రవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లో వర్షాలు పడుతున్నాయని, పప్పు శనగ సాగుకు ఇది సరైన సమయమని తెలిపారు. రైతులకు అవసరమైన శనగ విత్తనాలు ప్రభుత్వం నుంచి సరఫరా చేయలేదన్నారు.

ఇందుకు కారణాలు పరిశీలిస్తే గతేడాది శనగ విత్తనాలు సరఫరా చేసిన వ్యాపారులు, ఏజెన్సీలకు ఇప్పటి వరకూ బకాయిలు చెల్లించకపోవడంతో ఎపి సీడ్స్‌కు, వ్యవసాయ శాఖకు శనగ విత్తనాలు సరఫరా చేసేందుకు ముందుకు రాని పరిస్థితి నెలకొందన్నారు. రైతులు శనగ విత్తనాల కోసం ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని, క్వింటా రూ.6 వేలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం ఈ విత్తనాల ధరను క్వింటాకు రూ.7,800గా నిర్ణయించిందని, 25 శాతం సబ్సిడీతో రూ.5,850లకు రైతులకు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించిందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ధర, మార్కెట్ ధర ఒకే రకంగా ఉన్నాయని తెలిపారు. 90 శాతం సబ్సిడీతో విత్తనాలను పంపిణీ చేస్తే రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు. గతేడాది బకాయిలను వ్యాపారులకు చెల్లించి, రైతులకు అవసరమైన పప్పు శనగ విత్తనాల సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

అల్లుడిని ఎందుకు విచారించలేదు?

- 13 ఏళ్ల నాటి కేసు దర్యాప్తుపై పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

తన కుమార్తె ఆకస్మిక అదృశ్యం వెనుక అల్లుడు పాత్ర ఉందని తండ్రి ఫిర్యాదు చేస్తే దానిపై పోలీసులు ఎందుకు విచారించలేదని హైకోర్టు ప్రశ్నించింది. చట్ట ప్రకారం అనుమానితులను విచారించకపోవడంపట్ల ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అదృశ్యమైన మహిళ కోసం గాలించామని చెబుతున్న పోలీసులు అల్లుడిని విచారించినట్లుగా ఆధారాలు ఎందుకు చూపడం లేదని నిలదీసింది. 13 ఏళ్ల క్రితం ఒక వివాహిత అదృశ్యమైతే నేటికీ ఆచూకీ తేల్చని పోలీసుల తీరును తప్పుపట్టింది. వివరణ ఇవ్వాలని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్‌పి, కొవ్వూరు డిఎస్‌పి, తాడేపల్లిగూడెం ఎస్‌హెచ్ఒలను ఆదేశించింది. ఈ నెల 17న జరిగే విచారణ సమయంలో వారంతా వ్యక్తిగత హాజరు కావాలని జస్టిస్ బట్టు దేవానంద్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. జీలుగుమిల్లి మండలం, కామయ్యపాలెం గ్రామస్తుడు బండారు ప్రకాశరావు తన కుమార్తె మంగాదేవిని దండగర్ర గ్రామానికి చెందిన మోహన బ్రహ్మాజీకి ఇచ్చి పెళ్లి చేశారు. 2012 అక్టోబరు 18న బ్రహ్మాజీ ఫోన్ చేసి మంగాదేవి కనిపించడం లేదని ప్రకాశరావుకు చెప్పాడు. అదేరోజు తాడేపల్లిగూడెం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కేసు పురోగతి లేకపోవడంతో న్యాయం చేయాలంటూ ప్రకాశరావు.. సిఐ, కలెక్టరు, ఎస్‌పి, రాష్ట్ర మానవహక్కుల సంఘం, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీలకు వినతిపత్రాలు ఇచ్చారు.

ఫలితం లేకపోవడంతో 2017లో హైకోర్టులో పిటిషన్ వేశారు. అల్లుడు బ్రహ్మాజీని పోలీసులు విచారించారని ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. దీనిపై స్పందించిన హైకోర్టు, ఆ విషయాన్ని ప్రభుత్వం అఫిడవిట్‌లో ఎందుకు పేర్కొనలేదని ప్రశ్నించింది. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు తప్ప ఏమీ చేయలేదని తప్పుపట్టింది. ఈ కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించడం సముచితమని అభిప్రాయపడింది. గతంలో ఆదేశించిన మేరకు జిల్లా ఎస్‌పి కేసు దర్యాప్తు పురోగతిపై అందజేసిన రిపోర్టును పరిశీలించింది. పోలీసుల అలసత్వం కొట్టొచ్చినట్లు కనబడుతోందని తేల్చింది.

ఎపిపిఎస్‌సి ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా శశిధర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా సి శశిధర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఛైర్మన్‌గా ఉన్న మాజీ ఐపిఎస్ అధికారి ఎఆర్ అనురాధ పదవీకాలం గురువారం ముగిసింది. ఈ స్థానంలో ఎపిపిఎస్‌సి సభ్యులుగా ఉన్న శశిధర్‌కు ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించింది. విజయవాడలోని ఎపిపిఎస్‌సి కార్యాలయంలో శశిధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఎపిపిఎస్‌సి కార్యదర్శిగా ప్రభుత్వం పటాన్‌శెట్టి రవి సుభాష్‌ను నియమించింది. ఆయన కూడా శుక్రవారం కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు.

కొనసాగుతోన్న ఉపరితల ఆవర్తనం

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సముద్ర మట్టానికి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆవర్తనం ప్రభావంతో ఈ నెల 11న అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

46 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం వర్షపాతాలు నమోదయ్యాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లా నగరంలో 46 మిల్లీమీటర్లు, మలికిపురంలో 36.2, ప్రకాశం జిల్లా నర్సింగోలులో 27, కాకినాడ జిల్లా డి.పోలవరంలో 25.5, అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో 21.7 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతాలు నమోదైనట్లు ప్రఖర్‌జైన్ తెలిపారు.

పెరుగుతూ.. తగ్గుతున్న గోదావరి

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

మూడు నెలలుగా గోదావరి వరద పెరుగుతూ, తగ్గుతూ ముంపు మండలాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. గురువారం భద్రాచలం వద్ద 31 అడుగులకు వరద చేరడంతో ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వే పైకి వరదనీరు చేరడంతో వాగు అవతల 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం సాయంత్రానికి 25.60 అడుగులకు చేరడంతో గుండేటి వాగు కాజ్‌వే ముంపు నుండి బయటపడింది. దీంతో 12 గ్రామాలకు రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి. పోలవరం నుంచి 4,35,010 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 29.700 మీటర్లు, స్పిల్‌వే దిగువన 20.470 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు చెప్పారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 25.60 అడుగులకు చేరుకుంది.

జీతాలకోసం సిఆర్‌డిఎ కార్యాలయం ముట్టడి

రాజధానిలో సామాజిక భద్రత కరువు : సిహెచ్ బాబూరావు



సి ఆర్ డి ఎ కార్యాలయం ముందు ఆందోళన

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

ప్రపంచ బ్యాంకు, ఏషియన్ బ్యాంకు బృందాలతో ప్రభుత్వం పదేపదే చెబుతున్న సామాజిక భద్రత.. రాజధానిలో కరువైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు విమర్శించారు. రాజధాని నిర్మాణ సంస్థలకు రూ.కోట్లు అడ్వాన్స్‌గా చెల్లిస్తున్న ప్రభుత్వానికి రైతులు, రైతు కార్మికులు, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం ఏ మాత్రమూ పట్టడంలేదని అన్నారు. రెండు నెలల జీతాలు చెల్లించాలంటూ రాజధాని పారిశుద్ధ్య కార్మికులు సిఐటియు, రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తుళ్లూరు సి ఆర్ డి ఎ కార్యాలయాన్ని ముట్టడించారు. గ్రీవెన్స్ నిర్వహిస్తున్న అధికారుల వద్దకు ఎర్రజెండాలు చేతబట్టి ప్రదర్శనగా వెళ్లి జీతాలు చెల్లించే వరకు కదిలేది లేదంటూ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి సిహెచ్ బాబురావు నేలపై కూర్చొని నిరసన తెలిపారు.

గంటకుపైగా ఆందోళన కొనసాగించారు. ఈ క్రమంలో సిఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ సమస్యను పైఅధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ సందర్భంగా సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా వారి కడుపులు కాల్చుతూ, ఇంకోవైపు ప్రపంచ స్థాయి రాజధానంటూ ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు లేక.. భూములు లేక.. చివరకు రోడ్లు ఊడ్చుకుంటూ బతుకుతున్నా జీతాలు ఇవ్వరా.. ఇది వివక్ష కాదా అని నిలదీశారు.

మంగళగిరి, తాడేపల్లి, విజయవాడ, గుంటూరులో పారిశుద్ధ్య కార్మికులకు రూ 21 వేలు జీతం ఇస్తూ రాజధానిలో మాత్రం రూ. 12 వేలతో సరిపెడుతున్నారని అన్నారు. మంత్రి నారాయణకు సింగపూర్, కొరియా తిరగడమే సరిపోతోందని, సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. శుక్రవారం సాయంత్రానికి కొంతమంది కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమ చేస్తామని, మిగిలిన వారికి సోమవారం చెల్లిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. చెప్పిన మాట ప్రకారం పూర్తిగా జీతం చెల్లించకపోతే తిరిగి ఆందోళన కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం రవి, సిఐటియు జిల్లా కార్యదర్శి బి లక్ష్మణరావు, ఎం భాగ్యరాజు,పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకులు సుశీల, షేక్ జానీ, పేరం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

బిసి హాస్టల్‌లో 53 మంది విద్యార్థులకు అస్వస్థత

- ఆహారం కలుషితంతో వాంతులు, విరేచనాలు



గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి - పెదనందిపాడు (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్‌లో శుక్రవారం కలుషిత ఆహారం వల్ల 53 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులకు హాస్టల్లో గురువారం రాత్రి భోజనంలో బెండకాయ ఫ్రై, మజ్జిగ అందించారు. శుక్రవారం ఉదయం అన్నంతో, టమాటా పచ్చడి పెట్టారు. దాన్ని తిన్న కొద్దిసేపటికి విద్యార్థులు వాంతులు, విరేచనాలు, కడుపు నెప్పితో బాధపడ్డారు. విషయం తెలుసుకున్న సిబ్బంది ప్రైవేట్ వాహనంలో విద్యార్థులను పెదనందిపాడు మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ విద్యార్థులందరికీ వైద్యం అందించేందుకు సరైన వసతి సౌకర్యం లేనందున, స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులను అక్కడకు తీసుకెళ్లారు. వారిలో వాంతులు, విరేచనాలు, తీవ్ర కడుపు నెప్పితో బాధపడుతున్న 16 మంది విద్యార్థులను మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి, వారి అనారోగ్యానికి కారణాలను విచారించారు. అన్నపర్రులోని బిసి హాస్టల్‌ను సందర్శించి తాగునీటిని పరీక్షించాలని, పారిశుద్ధ్యం, ఆహార పదార్థాలు పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని ఆదేశించారు. కల్యాణమండపంలో చికిత్సపొందుతున్న విద్యార్థులను సిపిఎం నాయకులు డి.రమేష్‌బాబు, జంపని రామారావు తదితరులు పరామర్శించి, మెరుగైన చికిత్స అందించాలని అధికారులను కోరారు.

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, ఎమ్మెల్యే బి.రామాంజనేయులు శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. విద్యార్థులకు ఎటువంటి ప్రాణాపాయం లేదని, కలుషిత ఆహారంపై తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.


ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ కాలువలోని బండరాళ్లు తొలగించాలి

- కాంట్రాక్టర్‌కు నోటీసులు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల - చీరాల సరిహద్దుల్లోని ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ కాలువ అంచుల్లో వేసిన బండరాళ్లను పది రోజుల్లో తొలగించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ నియమించిన జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ రియల్టర్ బుర్ల వెంకట్రావుకు నోటీసులు జారీ చేసింది. ఈపురుపాలెం స్ట్రెయిట్ కట్ కాలువ వంపును బుర్ల వెంకట్రావ్ పూడ్చివేసి, అక్కడ పెద్దపెద్ద బండరాళ్లను వేసిన నేపథ్యంలో తమ బోట్లు దెబ్బతింటున్నాయని పది గ్రామాల మత్స్యకారులు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో చీరాల ఆర్‌డిఒ కార్యాలయంలో ఈ నెల 3న మత్స్యకారులు, అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

తొమ్మిది గ్రామాల మత్స్యకారులు ఆ కాలువపై ఆధారపడి సముద్రంలో వేట సాగిస్తున్నారన్నారు. సదరు కాలువ పూడ్చిన విషయమై ఆర్‌డిఒలు, మత్స్యశాఖ అధికారులు, పర్యావరణ నియంత్రణ బోర్డు అధికారులు, పోలీస్ అధికారులు సమన్వయంతో వివాదాస్పద ప్రాంతాన్ని పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. అధికారులు పరిశీలించి కాలువలో నీటి ప్రవాహానికి, సముద్రం నుంచి మర పడవల రాకపోకలకు అంతరాయం ఉందని నిర్ధారించారు. తక్షణమే పెద్ద పెద్ద బండరాళ్లను తొలగించాలని జాయింట్ ఇన్స్‌పెక్షన్ కమిటీ వెంకట్రావుకు నోటీసులిచ్చింది.



హంద్రినదిలో వ్యర్థాలను పరిశీలిస్తున్న పిపిఎస్‌ఎస్ నాయకులు ఇ.పుల్లారెడ్డి, తదితరులు

వ్యర్థాలతో నిండిన హంద్రినది

- కాలుష్య నగరంగా కర్నూలు
- మురుగు నీటి శుద్ధి కేంద్రం అస్తవ్యస్తం
- సందర్శించిన పిపిఎస్‌ఎస్ నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరానికి అందాల నివ్వాల్సిన హంద్రినది, అంధ వికారాలను అందిస్తూ... మురుగుదొడ్డిలా తయారైందని రాయలసీమ యూనివర్సిటీ పూర్వ ఇంగ్లీష్ లెక్చరర్ పి.ఇందిరాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మేధావులు, సమీప కాలనీల ప్రతినిధులతో కలిసి పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం కోట్లకిసాన్ ఘాటు నుండి కల్లూరు హంద్రిబ్రిడ్జి వరకు పర్యటించింది. హంద్రినది రోజురోజుకు కుదించుకుపోయి వరదలు వస్తే పరిసర కాలనీలు ముంపునకు గురవుతాయని భయపడే పరిస్థితి వచ్చిందని నది పరివాహక కాలనీల ప్రతినిధులు సి.రాము, వై.రామాంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖలతో పాటు స్థానిక ప్రజలు కూడా మట్టి, రాళ్ల, వ్యర్థపదార్థాలను నదిలో వేస్తున్నందున రోజురోజుకు విస్తీర్ణం తగ్గి కాలుష్య కేంద్రంగా మారిందన్నారు. ఒక్కోసారి భారీ వర్షానికి మురుగునీటి శుద్ధి కేంద్రం మునిగిపోయినా.. అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. పిపిఎస్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ నగరంలో ప్రవహించే నదుల్లో మురుగు నీరు చేరకుండా, వ్యర్థపదార్థాలు వేయకుండా, కబ్జాలకు గురి కాకుండా నదులను కాపాడాలని ప్రజలు, ప్రజాసంఘాలు కొన్నేళ్లుగా ఆందోళన చేస్తున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని నగరం మీదుగా వెళ్లే నదులన్నింటినీ సుందరీకరించాలని కోరారు. ఈ పర్యటనలో పిపిఎస్‌ఎస్ నాయకులు కె.వెంకటపతి, ఎమ్‌డి.యూనూస్, పి.ధీరజ్, సివి.వర్మ, ఎ.వెంకటేశ్వర్లు, ఇ.లక్ష్మణ గౌడు, ఎన్.శ్రీనివాసరెడ్డి, కె.శ్రీనివాసులు, ఆర్.బాబు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టులో మోహిత్‌రెడ్డికి ఊరట..!

- ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో/ న్యూ ఢిల్లీ బ్యూరో

లిక్కర్ స్కాం కేసులో చంద్రగిరి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి, తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. అక్రమ లిక్కర్ కేసులో మోహిత్‌రెడ్డిని సిట్ అధికారులు 39వ నిందితునిగా చేర్చడంతో ఎపి హైకోర్టులో ముందస్తు బెయిల్‌కు పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను హైకోర్టు ఈ నెల 7న కొట్టివేయడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్రమంగా కేసులు పెట్టి తనను అరెస్టు చేయడానికి సిట్ అధికారులు ప్రయత్నం చేస్తున్నారని, ఆ కేసులో తనను అరెస్టు నుంచి తప్పించాలని సర్వోన్నత న్యాయస్థానానికి విన్నవించారు. మోహిత్‌రెడ్డి తరపు న్యాయవాదులు ఆ విషయాన్ని ధర్మాసనం ముందుకు తీసుకువెళ్లగా ఎపి ప్రభుత్వం, సిట్ అధికారుల తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్‌రోహిత్గి, సిద్ధార్థ్‌లూత్రా, సిద్ధార్థ్ అగర్వాల్ ఎట్టి పరిస్థితుల్లో మోహిత్‌రెడ్డికి ముందస్తు బెయిల్ ఇవ్వరాదని తమ వాదనలను వినిపించారు. రెండు వైపులా వాదనలు విన్న ధర్మాసనం మోహిత్‌రెడ్డిని అరెస్టు చేయవద్దని ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు ఎపి ప్రభుత్వానికి, సిట్ అధికారులకు నోటీసులు పంపుతూ కేసును నాలుగు వారాలకు వాయిదా వేసింది.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి
- రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



ఐద్వా రాష్ట్ర మహాసభల పోస్టరను ఆవిష్కరిస్తున్న రమాదేవి, తదితరులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్, అనంతపురం కలెక్టరేట్

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. ఈ నెల 13 నుంచి అనంతపురంలో జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను కొలనుకొండలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో రమాదేవి మాట్లాడుతూ..సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఇంత వరకూ నిరుద్యోగులకు భృతి కానీ ఉపాధి కానీ కల్పించలేదని విమర్శించారు. ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని వాగ్దానం చేశారని, ఇప్పుడు వాగ్దానం అమలు చేయమంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాల్సి వస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జీరో వడ్డీ కింద నిధులు విడుదల చేసి పొదుపు మహిళల ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ మద్యం అమ్మకాలు, బెల్ట్ షాపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై రాష్ట్ర మహాసభలలో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఐద్వా నాయకులు డి శ్రీనివాసకుమారి, శ్రీదేవి, జి అమలాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన సాంస్కృతిక ప్రదర్శనలు

అనంతపురం కృష్ణకళామందిరంలో నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవాలు రెండోవ రోజూ ఆకట్టుకున్నాయి. ఫొటో ఎగ్జిబిషన్‌ను పలువురు ప్రముఖులు సందర్శించి, క్యూఆర్ కోడ్‌తో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సాంస్కృతిక ఉత్సవాలను ఎస్‌ఎస్‌బిఎన్ విద్యా సంస్థల కార్యదర్శి నిర్మల ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రచయిత షేక్ రియాజుద్దీన్ వేమన పద్యగానం చేశారు. సంధ్యామూర్తి శిష్యబృందం ప్రదర్శించిన భరతనాట్యం, డ్యాన్స్ మాస్టర్స్ వన్నూరు, విష్ణు శిష్యులు ప్రదర్శించిన నృత్యాలు, రూట్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు ప్రదర్శించిన ముఖాభినయం, గుంతకల్లు విద్యార్థినులు ప్రదర్శించిన 'వరకట్నం వేధింపుల'పై ప్రదర్శించిన నాటిక ఆలోచింప జేశాయి. ఫోక్ డ్యాన్స్, క్లాసికల్, మైమ్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నగరంలోని గణేనాయక్ భవన్‌లోని ఐద్వా కార్యాలయంలో మహాసభ వాల్‌పోస్టర్‌ను ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్యామల, చంద్రిక తదితరులు ఆవిష్కరించారు. సావిత్రి మాట్లాడుతూ... మహిళాభివృద్ధికి ఐద్వా చేస్తున్న పోరాటాలను వివరించారు. మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

2030 నాటికి డిజిటల్ చెల్లింపులు మూడు రెట్లు

న్యూఢిల్లీ : వచ్చే ఐదేళ్లలో దేశంలో డిజిటల్ చెల్లింపులు మూడు రెట్లు పెరగనున్నాయని పన్ను, కన్సల్టింగ్ సేవల సంస్థ పిడబ్ల్యుసి అంచనా వేసింది. ఆర్థిక సంవత్సరం 2024-25 నాటికి 206 బిలియన్లుగా ఉన్న డిజిటల్ చెల్లింపులు 2029-30 నాటికి 617 బిలియన్లకు చేరనున్నాయని పిడబ్ల్యుసి ఇండియన్ పేమెంట్ హ్యాండ్‌బుక్ 2025-2030లో వెల్లడించింది. భారత రిటైల్ చెలిలంపుల్లో యుపిఐ వృద్ధి భారీగా ఉందని తెలిపింది. అదే విధంగా క్రెడిట్ కార్డుల వినియోగం ప్రధాన మద్దతును అందించనుందని తెలిపింది. ఈ కార్డు చెల్లింపులు ప్రతీ ఏడాది సగటున 21 శాతం మేర పెరుగుతున్నాయని తెలిపింది.

75పైగా స్టార్టప్‌లకు కోటక్ బిజ్‌ల్యాబ్స్ మద్దతు

ముంబయి : కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ తన కోటక్ బిజ్ ల్యాబ్స్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ సీజన్ 2ను ప్రారంభించినట్లు తెలిపింది. ఇది 75 పైగా ప్రారంభ దశ స్టార్టప్‌లకు మార్గదర్శకత్వం, మార్కెట్ యాక్సెస్, ఉత్ప్రేరక నిధులు తదితర వాటికి మద్దతు ఇవ్వడానికి రూపొందించబడిందని కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ సిఎస్‌ఆర్ అండ్ ఇఎస్‌జి హెడ్ హిమాన్షు నివ్‌సర్కార్ తెలిపారు. అక్టోబర్ నుండి నవంబర్ 2026 వరకు జరిగే ఈ సీజన్ 2 భారతదేశం అంతటా 75పైగా స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వనుందన్నారు. తొలి సీజన్‌లో 1500పైగా దరఖాస్తులు రాగా.. 55 స్టార్టప్‌లకు మద్దతును అందించామన్నారు.

టిసిఎస్‌లో 20వేల ఉద్యోగ కోతలు



న్యూఢిల్లీ : దేశంలోని అతిపెద్ద ఐటి సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్)లో భారీగా ఉద్యోగులు తగ్గారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో దాదాపు 20,000 ఉద్యోగాలకు కోత పెట్టింది. ఈ ఏడాది జూన్ చివరిలో 6,13,069 మంది ఉద్యోగులతో ఉన్న సంస్థ సెప్టెంబర్ 30 నాటికి 5,93,314కి తగ్గింది. దీంతో పోల్చితే నికరంగా 19,755 ఉద్యోగులను ఇంటికి పంపించినట్లయ్యింది. ఇది గతంలో ఆ సంస్థ అంచనా వేసిన 12,000 ఉద్వాసనల కంటే 66 శాతం ఎక్కువ కావడం ఆందోళనకరం. స్వచ్ఛందంగా వైదొలగడం, ఇతర కారణాల వల్ల ఈ తగ్గింపు జరిగిందని టిసిఎస్ నూతన చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ సుదీప్ కున్నుమల్ తెలిపారు. కాగా.. క్యాంపస్ నియామకాలు లేదా కొత్త రిక్రూట్‌మెంట్ ప్రణాళికలపై టిసిఎస్ ఎలాంటి స్పష్టతను ఇవ్వలేదు.

సెన్సెక్స్ 329 పాయింట్ల పెరుగుదల

ముంబయి : కొనుగోళ్ల మద్దతుతో శుక్రవారం భారత మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఆటో, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, పిఎస్‌యు బ్యాంకులు, రియాల్టీ, ఫార్మా రంగాల షేర్ల మద్దతుతో 329 పాయింట్లు లేదా 0.4 శాతం పెరిగి 82,501కి చేరింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 104 పాయింట్లు లేదా 0.4 శాతం లాభపడి 25,285 వద్ద ముగిసింది. నిఫ్టీ సూచీలో సిప్లా, ఎస్‌బి మారుతీ సుజుకీ, డాక్టర్ రెడ్డీ ల్యాబ్స్, అదానీ పోర్ట్స్, పవర్ గ్రిడ్ షేర్లు లాభాలు నమోదు చేయగా, టిసిఎస్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, టెక్ మహీంద్రా, జెఎస్‌డబ్ల్యు షేర్లు నష్టాలను చవి చూశాయి. బిఎస్‌ఇ మిడ్ క్యాప్ సూచీ 0.4 శాతం పెరగ్గా.. స్మాల్ క్యాప్ సూచీ 0.6 శాతం తగ్గింది.



పెన్షనర్ల మహాధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

పెన్షన్ వేలిడేషన్ యాక్ట్‌ను రద్దు చేయాలి

ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన పెన్షన్ వేలిడేషన్ యాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ పెన్షన్ రూల్స్‌కు సవరణలతో, పెన్షనర్లను పాత, కొత్త అని విభజించే చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. పెన్షనర్ల మధ్య వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వానికి ఈ చట్టం అనుమతి కల్పించిందని తెలిపారు. ఇంతవరకూ పెన్షన్ పొందడం అనేది పెన్షనర్లు, ఆ తర్వాత వారి కుటుంబ సభ్యుల హక్కుగా ఉండేదని గుర్తుచేశారు. దాన్ని ఇప్పుడు కాలరాసి, పూర్తి అధికారం కేంద్ర ప్రభుత్వానికి దఖలు పరచడం తగదన్నారు. ఈ చట్టానికి ఆమోదం తెలపవద్దని పెన్షనర్ల సంఘాలు కోరినప్పటికీ రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడం తగదన్నారు. ఈ చట్టాన్ని యాజమాన్యాలు, పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం తెచ్చారన్నారు. మూడవ పే కమిషన్ సిఫార్సుల మేరకు ఉద్యోగులకు జీతాలు, డిఎ పెంపుదల సందర్భంలో పొందుతున్న పెన్షన్లు పెరగాల్సి ఉందన్నారు. జస్టిస్ చంద్ర చూడ్ ఇచ్చిన తీర్పు ప్రకారం పెన్షనర్ల మధ్య తేడాలు ఉండకూడదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రంగంలోని అన్ని సంస్థలు, పరిశ్రమలలో శాశ్వత ఉద్యోగాల ఖాళీలను చాలా కాలంగా భర్తీ చేయడం లేదన్నారు. ఈ వాస్తవాలను గుర్తించి పెన్షనర్ల సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ కన్వీనర్ ఎం చంద్రశేఖరరావు, డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ రెడ్డి వెంకటరావు, ఆశ్రఫ్, పి మణి, పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.



పోలీసు నిర్బంధంలో ఉన్న అప్పలరాజు (కుర్చీలో ఉన్న వ్యక్తి)

ఆరు రోజులుగా గృహ నిర్బంధంలో సిపిఎం నేత

ప్రజాశక్తి - ఎస్.రాయవరం (అనకాపల్లి)

ప్రజలకు, పర్యావరణానికి హాని కలిగించే బల్క్‌డ్రగ్ పార్కును నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేయొద్దంటూ ఉద్యమిస్తున్న సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై నేటికీ తీవ్ర నిర్బంధం కొనసాగుతోంది. ఆరు రోజులుగా అప్పలరాజును ఆయన స్వగ్రామమైన ఎస్.రాయవరం మండలం ధర్మవరంలోని ఇంట్లోనే గృహ నిర్బంధం చేశారు. బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో 28 రోజులుగా మత్స్యకారులు నిరసన దీక్షలు చేపడుతున్న విషయం తెలిసిందే. అక్కడ సెక్షన్ 30 అమల్లోకి తెచ్చారు. ఇతర ప్రాంతాల వారు ఆ గ్రామానికి వెళ్లకుండా ఆదేశాలు జారీ చేశారు. మత్స్యకారుల పోరాటానికి మద్దతు ఇస్తున్న అప్పలరాజును ఈ క్రమంలోనే గృహ నిర్బంధం చేశారు. అప్పలరాజు మాట్లాడుతూ... నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, అణగదొక్కాలని చూస్తే ఉద్యమం మరింత ఎత్తుకు ఎగిసిపడుతుందని, ఈ విషయాన్ని ప్రభుత్వం, పోలీసులు గుర్తించుకోవాలన్నారు.



ఫ్యాక్టరీ నుంచి ఎగసిపడుతున్న మంటలు

పొగాకు కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

- రూ.557 కోట్ల నష్టం

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం కలికివాయి పంచాయతీ పరిధిలోని బెల్లం కోటయ్య పొగాకు కంపెనీలో శుక్రవారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. సుమారు 4.5 లక్షల కేజీల పొగాకు కాలి బూడిదైంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా నల్లటి పొగ కమ్మేసింది. స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కార్మికులు ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణపాయం తప్పింది.

స్థానికుల కథనం ప్రకారం.. బెల్లం కోటయ్య పొగాకు కంపెనీ గోడౌనును 2012లో గాడ్ ఫ్రై ఫిలిప్స్ లిమిటెడ్ కంపెనీ లీజుకు తీసుకుని పొగాకు గ్రేడింగ్ చేసి విదేశాలకు తరలిస్తుంది. శుక్రవారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగి పరిశ్రమ మొత్తానికి వ్యాపించాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఐదు ఫైర్ ఇంజన్లు రంగంలోకి దిగి మంటలను అదుపు చేశాయి. అప్పటికే గ్రేడింగ్ పూర్తయిన బేళ్లతో పాటు గ్రేడింగ్‌కు సిద్ధంగా ఉన్న బేళు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ.557 కోట్ల నష్టం వాటిల్లినట్లు కంపెనీ జనరల్ మేనేజర్ ప్రభాకర్‌రావు తెలిపారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రమాద కారణాలపై ఆరా తీశారు. కంపెనీ జనరల్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయం

వైద్య సేవలకు సుస్తీ!

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలకు సుస్తీ చేసింది. ఒకవైపున ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్‌సి) డాక్టర్లు ఆందోళన చేస్తుండగా మరోవైపు ఎన్‌టిఆర్ వైద్య (ఆరోగ్యశ్రీ) సేవలను ఎపి స్పెషాలిటీ ఆస్పత్రి అసోసియేషన్ (ఆషా) నిలిపివేయడంతో ప్రజలకు వైద్య ఆరోగ్య కష్టాలు అధికమవుతున్నాయి. సీజనల్ జ్వరాలు, ఇతర రోగాలు పట్టిపీడిస్తున్న సమయంలో ఇటువంటి పరిస్థితి తలెత్తడం బాధాకరం. ఆందోళనలో వున్నది వైద్యులు, సేవలు నిలిపేస్తామన్నది ఆషా అయినప్పటికీ ఈ స్థితి ఉత్పన్నం కావడానికి మాత్రం ప్రభుత్వమే కారణం. కాబట్టి పరిష్కరించే బాధ్యత కూడా ముమ్మాటికీ సర్కారు వారిదే! త్వరితగతిన చక్కదిద్దకపోతే రాష్ట్రం 'అనారోగ్యాంధ్రప్రదేశ్'గా దిగజారవచ్చు. ఆరోగ్యమే మహా భాగ్యం. కాబట్టి గుంటూరు, విజయవాడ ఘటనల్లాంటి ప్రమాద ఘంటికలు మోగకముందే ప్రభుత్వాధినేత మేలుకోవడం ఎంతో అవసరం.

పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలందించే ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకం కింద ప్రైవేటు ఆసుపత్రులకు ఏడాది నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పథకం కింద వైద్య సేవలను ఎన్‌టిఆర్ వైద్యసేవల నెట్‌వర్క్ ఆస్పత్రులు శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిలిపివేశాయి. రూ.2,700 కోట్ల బిల్లుల బకాయిలు ఏడాది నుంచి పేరుకుపోయాయని, బకాయిల చెల్లింపు విషయంలో ప్రభుత్వం కనీస స్పష్టత ఇవ్వడం లేదని కూడా ఆషా వాపోయింది. 2005 నుంచి రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం అమలవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ కింద 894 ప్రయివేటు ఆస్పత్రులున్నాయి. గతంలో వున్న వైద్య ఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతామనీ యూనివర్సల్ హెల్త్ కవరేజ్ తీసుకొస్తామనీ టిడిపి కూటమి ప్రభుత్వం గొప్పగా చెప్పింది. ఈ మేరకు ఇన్సూరెన్స్ కంపెనీల నుండి టెండర్లనూ ఆహ్వానించారు. కానీ ఇప్పుడున్న ఐదు లక్షల కవరేజికే ముప్పు ఏర్పడడం ఓ విషాదం. అయితే బకాయిలపై స్పష్టతనిచ్చి పరిష్కరించవలసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి బకాయిల పాపం గత ప్రభుత్వానిదేనని తప్పించుకోవడం సబబు కాదు. అధికారంలో ఎవరున్నా అది రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతగానే అందరూ భావిస్తారు. రాజ్యాంగం, చట్టాలు అదే చెబుతున్నాయి. కాబట్టి నెపాలు మోపడం కాకుండా ప్రజలకు వైద్య సేవలు ఆటంకం లేకుండా ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టాలి.

వైద్య విద్య పిజి కోర్సుల్లో ఇన్ సర్వీస్ కోటా 15 నుంచి 20 శాతం అన్ని విభాగాల్లో ఐదేళ్లపాటు కొనసాగించాలని, కొన్ని దీర్ఘ కాలిక సమస్యల పరిష్కారాన్ని కోరుతూ పిహెచ్‌సి వైద్యులు ఇప్పటికే ఆందోళన చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న వైద్యులవి గొంతెమ్మ కోర్కెలు కావు. గత ఇరవయ్యేళ్లుగా పదోన్నతులు లేక కొంతమంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లుగానే కొనసాగుతున్నారన్న వారి ఆవేదన సర్కారు పట్టించుకోవాల్సిందే! పిజి కోటా విషయం ఈ ఏడాది మాత్రమే కొనసాగిస్తామని, అనంతరం ఖాళీలను బట్టి కోటాను నిర్ణయిస్తామని చర్చల్లో అధికారులు చెప్పడం సమంజసం కాదు. గత మూడేళ్లలో పిజి వైద్యులను అవసరానికంటే అధికంగా నియమించుకున్నట్లు, ఇన్ సర్వీసు కోటా ఏళ్ల తరబడి అమలుకు సాధ్యం కాదనడం ధర్మం కాదు. 20 శాతం ఇన్ సర్వీసు కోటా ఇస్తే ప్రభుత్వ అవసరానికి మించి పిజి వైద్యులు అందుబాటులోకి వస్తారని, వీరి సేవలు వినియోగించుకోవడానికి ఖాళీ పోస్టులు లేవంటే ఎలా? ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలందించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్ర స్థానాన లేదు. మానవాభివృద్ధి సూచికల్లోనూ మనం దిగువనే ఉన్నాం. ఇంకా డోలీ మోతలు సాగుతున్న రోజుల్లో ఖాళీ వైద్య పోస్టులు లేవంటే ఎలా? ఇప్పటికే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పిపిపి విధానం తెచ్చినందుకు టిడిపి కూటమిపట్ల ప్రజలు కోపంగా ఉన్నారు. సీజనల్ వ్యాధుల పెరుగుదల నేపథ్యంలో పిహెచ్‌సి వైద్యుల ఆందోళన, ఆరోగ్యశ్రీ సేవల నిలుపుదల వంటి చర్యలతో వైద్య ఆరోగ్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వంపట్ల ప్రజాగ్రహం మరింతగా పెరగవచ్చు. తస్మాత్ జాగ్రత్త!

మహనీయుల మాట



పాముల్ని ఆరాధించే
కాలం పోయింది!
దెయ్యాల్ని పూజించే
రోజులు పోయాయి!
రాతి బొమ్మల్ని కొలిచే
కాలం ఇక లేదు!
పిల్లల్ని పూజించే
రోజులు మనవి!
- గిజూబాయి,
సుప్రసిద్ధ విద్యావేత్త.

విభజన, విద్వేషాల వందేళ్ల హంగామా

వ్యాఖ్య



> **ఆర్.ఎస్.ఎస్ ఆ సందర్భంలో జాతీయ పతాకాన్ని కూడా అవమానించింది. ఆ సంచికలోనే ఇలా రాసింది: కర్మ వశాన అధికారంలోకి వచ్చినవారు మన చేతుల్లో త్రివర్ణ పతాకం వుంచవచ్చు. కానీ హిందువులు దాన్ని ఎన్నడూ గౌరవించి తమదిగా భావించబోరు". అదే ఊపులో ఆర్.ఎస్.ఎస్ జాతీయ గీతాన్ని ఆక్షేపించి 'వందేమాతరం' కావాలని వాదించింది. బంకించంద్ర ఛటర్జీ రాసిన ఆనందమఠం నవలలోని ఆ గీతం మతభావ పూరితమనేది నిస్సందేహం. ముస్లింలను, ఇస్లాంను అవహేళన చేసే ఆ గీతాన్ని తీసుకోవాలని చెప్పడం యాదృచ్ఛికమేమీ కాదు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచీ ఆర్.ఎస్.ఎస్ ఇదే వైఖరి అనుసరించింది. వలస పీడన నుంచి దేశ విముక్తి కోసం సాగిన ఉమ్మడి పోరాటంలో పాల్గొనకుండా దూరం వుండిపోయింది. "కేవలం హిందువుల పట్ల మాత్రమే ప్రాథమికంగా మా కట్టుబాటు" అనేంత వరకూ వెళ్లింది. ఆ కారణంగానే ఆర్.ఎస్.ఎస్ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఐక్యం చేసే బదులు హిందువులను ఏకం చేసి సాయుధం చేయాలని పిలుపునిచ్చింది.**

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ఆర్.ఎస్.ఎస్ శత వార్షికోత్సవం పేరిట సాగుతున్న శృతి మించిన ఆర్భాటాల మధ్య దేశం ఒక వికృత సన్నివేశాన్ని చూడాల్సి వచ్చింది. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌లో నమోదు చేసుకున్న రాకేశ్ కిశోర్ అనే ఒక లాయర్ భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై చెప్పు విసిరారు. ఒక పిటిషన్‌ను తిరస్కరించే సందర్భంలో జస్టిస్ గవాయ్ హిందూ మతాన్ని కించపర్చేలా మాట్లాడారన్నది ఆ లాయర్ ఫిర్యాదు. అయితే దిగ్భ్రాంతికరమైన ఈ ఘటనను ఏదో అత్యంత అప్రధానమైన అంశంగా చేసేందుకు బడా మీడియా హద్దులన్నీ మీరిపోయింది. కేవలం కాగితాల కట్ట విసిరేశాడే గాని చెప్పు కాదని మసి పూసి మారేడుకాయ చేసేందుకు తనకు అలవాటైన రీతిలోనే ఈ మీడియా ప్రయత్నం చేసింది. మరి కొందరేమో ఇది తన మత భావాలను దెబ్బ తీశారన్న ఆగ్రహంతోనే రాకేశ్ అలా ప్రవర్తించారని సమర్థించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు ఎక్కడ రాజ్యాంగ విరుద్ధమైన చర్యలు జరిగినా సమర్థించేందుకు ఈ సాకు చెప్పడం బాగా అలవాటైంది కదా!

ఆర్.ఎస్.ఎస్ శత వార్షికోత్సవం పేరుతో జరుగుతున్న హడావుడికీ- దారుణమైన ఈ ఘటనకూ మధ్యనగల సంబంధాన్ని ఖచ్చితంగా ఎత్తిచూపడం కష్టమేమో గాని ఈ వికృత చర్య వెనక వున్న ద్వేషం, ప్రతీకారం గమనించకుండా వుండటం సాధ్యమయ్యేది కాదు. దేశ రాజకీయ జీవితంలో ఆర్.ఎస్.ఎస్ పట్టు పెరగడంతో పాటు ఇలాంటి వికృత చర్యల పెరుగుదల ఏకకాలంలో జరుగుతున్నదనే వాస్తవం కూడా కాదనలేనిది. మహాత్మా గాంధీ హత్యనే దానికి అతి పెద్ద ఉదాహరణ. ఈ అమానుష హత్యకు దారితీసిన పరిస్థితులను రెచ్చగొట్టడంలో ఆర్.ఎస్.ఎస్ పాత్రకు సంబంధించి బలమైన సాక్ష్యాలు కనిపిస్తున్నా నిర్దిష్ట ఆధారాలు లేవనే కారణంగానే దాని కీలక బాధ్యులు బయటపడగలిగారు. గోల్వాల్కర్ వంటి వారు ఆ విధంగానే తమ చేతికి మట్టి అంటకుండా చేసుకోగలిగారు. అప్పటి హోంమంత్రి సర్దార్ పటేల్ గోల్వాల్కర్‌కు రాసిన లేఖలో స్పష్టంగా ఈ విషయం పేర్కొన్నారు. హిందూ మహాసభతో పాటుగా ఆర్.ఎస్.ఎస్ సాగించిన ప్రచారోద్యమం వల్ల ఏర్పడిన పరిస్థితులే మహాత్ముడి హత్యకు దారితీశాయని ఆయన రాశారు.

గతంపై చర్చకు దారి

వాస్తవానికి ఆర్.ఎస్.ఎస్ గొప్పతనం గురించి అదేపనిగా ఆకాశానికెత్తి చూపిస్తున్న ప్రయత్నమే దానిపై ప్రజల్లో విస్తృత చర్చకు దారితీస్తున్నది. ఆ సంస్థ సందేహాస్పద చరిత్రను ముందుకు తెస్తున్నది. ఆ సంస్థ మూల సూత్రాలేమిటి, విషపూరితమైన దాని సిద్ధాంతాలేమిటి, సావర్కర్ చెప్పిన హిందూత్వ అనేదాన్ని వాస్తవం చేసేందుకు ఆ సంస్థ అనుసరించే పద్ధతులేమిటి అన్నది చర్చకు పెట్టడానికి ఇదే మంచి అవకాశమైందని అనేకమంది భావిస్తున్నారు. ఈ సిద్ధాంతం మూల సారాన్ని సావర్కర్ 'హిందూత్వ మూల సూత్రాలు' (ఎసెన్షియల్స్ ఆఫ్ హిందూత్వ) అన్న గ్రంథంలో పొందుపర్చినా దానికి కార్యాచరణ సమకూర్చింది ఆర్.ఎస్.ఎస్ మాత్రమే. సావర్కర్ బోధించిన హిందూ రాష్ట్ర స్థాపన దిశగా అవసరమైన నిర్మాణ వ్యవస్థను అందించింది ఆరెస్సెసే.

హిందూ మతాన్ని రాజకీయాధికార సాధనంగా ఉపయోగించుకోవడానికి సావర్కర్ సమకూర్చిన సైద్ధాంతిక ప్రాతిపదిక ఇందుకు కొంచెం భిన్నమైనదనేది నిజమే. ఆయన చెప్పింది అసలు సిసలు రాజకీయ పథకమే. హిందూ మతాన్ని, హిందూత్వను గందరగోళపర్చడం కులాలతో ఛిద్రమైన హిందువులను ఐక్యం చేయడానికి ఆటంకమవుతుందని ఆయన అన్నారు.

అయితే కాలం గడిచిన కొద్దీ ఆర్.ఎస్.ఎస్ ముందుకు తెచ్చిన కోర్కెలు, నినాదాలు చూస్తే ఒక సామాజిక దృక్పథంగా బ్రాహ్మణవాదం అన్నది హిందూత్వ పద్ధతులకు వదలని జాడ్యమని తేలిపోయింది. ఉదాహరణకు ఆర్.ఎస్.ఎస్ అధికార పత్రిక 'ఆర్గనైజర్' స్వాతంత్ర్యోద్యమ సమయంలోనే 1947 ఆగష్టు 15నే సాముదాయిక జాతి అనే మొత్తం దృక్పథాన్నే తోసిపుచ్చింది ('ఎటువైపు' అంటూ రాసిన సంపాదకీయంలో). "జాతీయత అనే బూటకపు భావనల ప్రేరణతో మనం ఎంత మాత్రం ప్రభావితం కావద్దు. ఈ గందరగోళ భావన, వర్తమాన భవిష్యత్ సమస్యలను అధిగమించడానికి మార్గం ఒక్కటే. హిందూస్థాన్‌లో హిందువులు మాత్రమే జాతిగా వుంటారనే ప్రాథమిక వాస్తవాన్ని గుర్తించాలి. ఆ సురక్షితమైన సుదృఢ పునాదిపైనే జాతి నిర్మాణం జరగాలి. దేశమే హిందువులతో హిందూ సంప్రదాయాలతో, సంస్కృతి భావాలు, ఆకాంక్షలతో నిర్మితమవుతుంది".

'జాతీయ గీతం, పతాకం తప్పే'

ఆర్.ఎస్.ఎస్ ఆ సందర్భంలో జాతీయ పతాకాన్ని కూడా అవమానించింది. ఆ సంచికలోనే ఇలా రాసింది: కర్మ వశాన అధికారంలోకి వచ్చినవారు మన చేతుల్లో త్రివర్ణ పతాకం వుంచవచ్చు. కానీ హిందువులు దాన్ని ఎన్నడూ గౌరవించి తమదిగా భావించబోరు". అదే ఊపులో ఆర్.ఎస్.ఎస్ జాతీయ గీతాన్ని ఆక్షేపించి 'వందేమాతరం' కావాలని వాదించింది. బంకించంద్ర ఛటర్జీ రాసిన ఆనందమఠం నవలలోని ఆ గీతం మతభావ పూరితమనేది నిస్సందేహం. ముస్లింలను, ఇస్లాంను అవహేళన చేసే ఆ గీతాన్ని తీసుకోవాలని చెప్పడం యాదృచ్ఛికమేమీ కాదు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచీ ఆర్.ఎస్.ఎస్ ఇదే వైఖరి అనుసరించింది. వలస పీడన నుంచి దేశ విముక్తి కోసం సాగిన ఉమ్మడి పోరాటంలో పాల్గొనకుండా దూరం వుండిపోయింది. "కేవలం హిందువుల పట్ల మాత్రమే ప్రాథమికంగా మా కట్టుబాటు" అనేంత వరకూ వెళ్లింది. ఆ కారణంగానే ఆర్.ఎస్.ఎస్ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఐక్యం చేసే బదులు హిందువులను ఏకం చేసి సాయుధం చేయాలని పిలుపునిచ్చింది.

రాజ్యాంగాన్ని ఆమోదించే సమయంలోనూ ఆర్.ఎస్.ఎస్ ఇదే పల్లవి పాడుతూ వచ్చింది. దాన్ని భారతీయతకు విరుద్ధమని ఖండనలు చేసింది. 1949 నవంబరు 30 'ఆర్గనైజర్' సంచిక సంపాదకీయం కాలం చెల్లిన మనుస్మృతినే రాజ్యాంగంగా స్వీకరించాలని చెప్పింది... "అయితే ప్రాచీన భారతంలోని విశిష్ట రాజ్యాంగ వికాసం గురించిన ప్రస్తావనే మన రాజ్యాంగంలో లేదు. స్పార్టాలో లైకుర్గస్ లేదా పర్షియాలో సోలోమ్ లకు చాలా ముందే మను శాసనాలు రూపొందాయి. ఈ రోజుకు కూడా మనుస్మృతిలో రాసినవి ప్రపంచం ప్రశంసలు పొందుతున్నాయి. ఉన్నఫళాన విధేయతనూ అనుగుణ్యతనూ పొందగలుగుతున్నాయి. కాని మన రాజ్యాంగ పండితుల దృష్టిలో మాత్రం అవి అస్సలు అక్కరకు రానివి".

అసలు గోల్వాల్కరే స్వయంగా రాజ్యాంగాన్ని పూర్తిగా తిరస్కరించారు. "మన రాజ్యాంగం భరించలేనంత జటిలమైంది. వివిధ పాశ్చాత్య దేశాల రాజ్యాంగాల నుంచి వేర్వేరు నిబంధనలు తీసుకుని కలిపి కుట్టిన అతుకుల బొంత తప్ప ఏకరూపత కలిగింది కాదు. అందులో మన స్వంతం అని ఖచ్చితంగా చెప్పుకోగలిగిందేమీ లేదు. ఆదేశిక సూత్రాలలో మన జాతీయ కర్తవ్యం, గమనం గురించి మన జీవితాల కీలకాంశం ఏమిటనేదాని గురించి ఒక్క ముక్కయినా వుందా?" అన్నారు.

ప్రచారక్ ప్రధాని అయ్యాక..

ఈ విధంగా 'ఒకే ప్రజలు ఒకే దేశం" అన్న దృక్పథాన్ని ఉక్కు కవచంలా బిగించేసి హిందీ, హిందూ, హిందుస్థాన్ నినాదంగా ఏకపక్షంగా కుదించడమే ఆర్.ఎస్.ఎస్ సైద్ధాంతిక బోధనలలో ప్రబలమైన అంశం. ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులపై కరుడుగట్టిన వ్యతిరేకత దానిది. కనుక ఆర్.ఎస్.ఎస్ మౌలిక పునాది సూత్రం అమలు రెండు నాల్కల మాటలతో కొనసాగించడానికి ఎలాంటి ఆటంకం ఎదురవలేదు. ఆర్.ఎస్.ఎస్ ప్రచారక్ దేశ ప్రధాని పీఠాన్ని ఆక్రమించే తరుణం వచ్చే వరకూ ఇదే ద్వంద్వ భాషణ నడిచింది. ఆయనకు వచ్చే సరికి అసలు అస్తిత్వ రూపాన్ని దాచుకోవలసిన అగత్యమే లేకుండా పోయింది. ప్రజాస్వామిక, లౌకిక రాజ్యాంగం పట్ల వారికుండే స్వతస్సిద్ధమైన ద్వేషంతో పాటు ఆయన ప్రభుత్వం అదే ఫాసిస్టు తరహా హిందూ రాష్ట్ర భావనతో లోపలి నుంచే దాన్ని విచ్ఛిన్నం చేయాలని పథకాలు పన్నుతున్నది. రాజ్యాంగం పట్ల నిరంతరాయంగా ప్రకటించే విధేయత కేవలం కాలం గడపడానికి మాత్రమే. అదను చూసి దాన్ని కూడా వదిలించుకుంటారు.

అయితే ఈ విధంగా రెండు కాళ్ళకూ రెండేసి చొప్పున చెప్పులేసుకోవడం అన్ని వేళలా కుదరదు. అందుకే ఆర్.ఎస్.ఎస్ ను ఆకాశానికెత్తే ఈ శతవార్షికోత్సవ ప్రచారకాండకూ గత వందేళ్ళ చరిత్రలో దాని నిర్వాకాల నిజానిజాలకూ దారుణమైన దాని గతానికి పొంతన కుదరేది కాదు. జస్టిస్ గవాయ్‌పై దాడికి ప్రధానమంత్రి సుతిమెత్తని విమర్శలు చేసి... సిజెఐ సంయమనాన్ని, హుందాతనాన్ని ప్రశంసించినా మితవాద సోషల్ మీడియా బ్రిగేడ్ గవాయ్‌పై వ్యక్తిగత దాడి కొనసాగిస్తూనే వుంది. వారి మనువాద మనస్తత్వం కారణంగా ఆయనపై ప్రత్యేకంగా విషం గక్కడాన్ని అర్థం చేసుకోవచ్చు. అందువల్ల ఆర్.ఎస్.ఎస్ శతవార్షికోత్సవం వారి అనుమానాస్పద గతంపై ముసుగు లాగి పారేస్తుంది. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయం, సమాఖ్య తత్వం సహా మన రాజ్యాంగ వ్యవస్థాపక సూత్రాలుగా వున్నాయి. అలాంటి రాజ్యాంగ మూలసూత్రాలను కళంకితం చేసేలా ప్రభుత్వం సాగిస్తున్న అప్రతిష్ఠాకర ప్రయత్నాలను బట్టబయలు చేసే సందర్భం ఇది. ఈ మొత్తాన్ని ఆమూలాగ్రం బహిర్గత పరచేందుకు అవసరమైన అధ్యయనాలనూ విశ్లేషణలనూ పాఠకులకు అందజేస్తానని పీపుల్స్ డెమోక్రసీ హామీ నిస్తున్నది.

(అక్టోబరు 8 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

బెడిసి కొడుతున్న పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం!

విశ్లేషణ


ఆర్. లక్ష్మయ్య

> **ఈ రెండు మెట్రో రైళ్ల అనుభవాలు రిలయన్స్‌కు సంబంధించినవి. ఇప్పుడు ఎల్ అండ్ టి కూడా హైదరాబాద్ మెట్రో రైల్‌ను వదిలి తెలంగాణ ప్రభుత్వంపై బాధ్యత వేసింది. అంటే ఇది తెలంగాణ ప్రజల డబ్బు. ఇలాంటి చేదు అనుభవాలు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పిపిపి మోడళ్లను దూకుడుగా అమలు చేస్తున్నాయి. పిపిపి అనేది ప్రభుత్వాల "మంత్రం"గా మారింది. ప్రైవేట్ కంపెనీలు ప్రజల డబ్బుపై లాభాలు గుంజుకునేందుకు వస్తాయి. సాధ్యం కానప్పుడు ఒప్పందాలను ఉల్లంఘించి తప్పుకుంటాయి లేదా ఎలాంటి చర్యలకైనా ఒడిగడతాయి. ప్రజల గురించి ఏమాత్రం పట్టించుకోవు.**

ప్రపంచ వ్యాపితంగా ప్రజా రవాణాను ప్రోత్సహించే లక్ష్యాలు, ప్రభుత్వాల పాత్ర-భారత ప్రభుత్వం, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలిద్దాం.

హైదరాబాద్ మెట్రో రైల్ భాగస్వామ్య సంస్థ ఎల్ అండ్ టి ఒప్పందం గడువు పూర్తికాక ముందే ప్రాజెక్ట్ నుండి తప్పుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.13,000 కోట్ల అప్పు భారం మోయాలని ఎల్ అండ్ టి పెట్టిన షరతులను అంగీకరించి ప్రాజెక్ట్‌ను స్వాధీనం చేసుకుంది.

ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ మెట్రో ప్రాజెక్ట్ (న్యూ ఢిల్లీ రైల్వే స్టేషన్ నుండి ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు) పిపిపి మోడల్‌లో, బి.ఒ.టి (బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్) విధానంలో రిలయన్స్ గ్రూప్-ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డి.ఎమ్.ఆర్.సి) భాగస్వామ్యంతో నిర్మించబడింది. ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.5,700 కోట్లు. అందులో భూసేకరణ, టనెళ్లు, స్టేషన్లు, డిపోలు వంటి సివిల్ నిర్మాణాలకు డి.ఎమ్.ఆర్.సి రూ.2,850 కోట్లు ఖర్చు చేయాలి. డిజైన్, సరఫరా, ఇన్‌స్టలేషన్ మొదలైన వాటికి రిలయన్స్ రూ.2,850 కోట్లు వెచ్చించాలి. ఒప్పందం కాలపరిమితి 30 సంవత్సరాలు. మరో 30 సంవత్సరాలు పొడిగించవచ్చు. ప్రయాణికులు చెల్లించే చార్జీలు, చార్జియేతర ఆదాయాలు రిలయన్స్‌కే చెందుతాయి. డి.ఎమ్.ఆర్.సి కి మాత్రం రిలయన్స్ ప్రతి సంవత్సరం రూ.51 కోట్లు చెల్లించాలి.

ఈ మెట్రో సర్వీసు 2011 ఫిబ్రవరి 23న ప్రారంభమైంది. అప్పుడు చార్జీ రూ.80.

జూన్ 30 తర్వాత ఆపరేషన్లు కొనసాగించబోమని 2013 జూన్‌లో రిలయన్స్ అల్టిమేటం ఇచ్చింది. దాంతో నిర్వహణను డి.ఎమ్.ఆర్.సి నెత్తికెత్తుకోక తప్పనిసరి పరిస్థితుల్లో స్వాధీనం చేసుకుని, చార్జీని రూ.80 నుండి రూ.60కి తగ్గించి నడుపుతున్నది. ఇప్పటికీ డి.ఎమ్.ఆర్.సి ఆ సర్వీసును నడుపుతోంది. రిలయన్స్ ప్రాజెక్ట్‌ను వదిలేయడమే కాక, డి.ఎమ్.ఆర్.సి నుండి భారీ మొత్తాన్ని డిమాండ్ చేస్తూ కోర్టులో కేసు వేసింది. ట్రైబ్యునల్ రిలయన్స్ పక్షాన తీర్పు ఇస్తూ డి.ఎమ్.ఆర్.సి రూ.2782.33 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. డి.ఎమ్.ఆర్.సి ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టులలో అప్పీలు చేసింది. చివరకు 2024 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ట్రైబ్యునల్ ఆదేశాన్ని రద్దు చేసి డి.ఎమ్.ఆర్.సి కి ఉపశమనం కలిగించింది.

ముంబై మెట్రో రైలు ప్రాజెక్ట్ కూడా పిపిపి మోడల్‌లో ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (26 శాతం), రిలయన్స్ (74 శాతం) భాగస్వామ్యంతో ప్రారంభమైంది. అంగీకారం ప్రకారం చార్జీలు రూ.9 నుండి రూ.13 మధ్య ఉండాలని నిర్ణయించారు. అయితే, 2014 జూన్ 8న ఆపరేషన్లు ప్రారంభమైనప్పుడు రిలయన్స్ ఏకపక్షంగా చార్జీలను రూ.10 నుండి రూ.40 వరకు పెంచుకొని వసూలు చేసింది. దీనిపై ముంబై మున్సిపల్ కార్పొరేషన్ కోర్టుకు వెళ్లింది. కానీ కోర్టులు రిలయన్స్ చర్యను అక్రమమని ప్రకటించలేదు. ఫలితంగా రిలయన్స్ స్వంతంగా నిర్ణయించుకున్న చార్జీలను వసూలు చేసింది. తర్వాత రిలయన్స్ రూ.110 వరకు చార్జీ పెంచాలని ప్రతిపాదించింది. బాంబే హైకోర్టు ఆ ప్రతిపాదనపై స్టే ఇచ్చింది. వివాదం ఇంకా కొనసాగుతోంది.

ఈ రెండు మెట్రో రైళ్ల అనుభవాలు రిలయన్స్‌కు సంబంధించినవి. ఇప్పుడు ఎల్ అండ్ టి కూడా హైదరాబాద్ మెట్రో రైల్‌ను వదిలి తెలంగాణ ప్రభుత్వంపై బాధ్యత వేసింది. అంటే ఇది తెలంగాణ ప్రజల డబ్బు. ఇలాంటి చేదు అనుభవాలు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పిపిపి మోడళ్లను దూకుడుగా అమలు చేస్తున్నాయి. పిపిపి అనేది ప్రభుత్వాల "మంత్రం"గా మారింది. ప్రైవేట్ కంపెనీలు ప్రజల డబ్బుపై లాభాలు గుంజుకునేందుకు వస్తాయి. సాధ్యం కానప్పుడు ఒప్పందాలను ఉల్లంఘించి తప్పుకుంటాయి లేదా ఎలాంటి చర్యలకైనా ఒడిగడతాయి. ప్రజల గురించి ఏమాత్రం పట్టించుకోవు.

మెట్రో రైలు ప్రాజెక్టులను లాభం-నష్టం అనే స్కేల్‌పై కొలవాలా? ప్రపంచ అనుభవం ఏమిటి?

ప్రపంచవ్యాప్తంగా 65 దేశాలలోని 204 నగరాల్లో 970 మెట్రో రైలు ప్రాజెక్టులు నడుస్తున్నాయి. పెట్టుబడులు, నిర్వహణ ఖర్చులను కలిపి లెక్కిస్తే ఒక్కటంటే ఒక్క ప్రాజెక్ట్ కూడా లాభాల్లో లేదు. ప్రజా రవాణా మొత్తం కూడా అదే పరిస్థితి. కానీ హాంకాంగ్ వంటి కొన్ని మెట్రోలు మాత్రం...నిర్వహణ ఖర్చుల పరంగా చూసినప్పుడు మిగులు చూపుతున్నాయి. అవి మెట్రో స్టేషన్ల చుట్టూ రియల్ ఎస్టేట్ వ్యాపారాల ద్వారా భారీ ఆదాయం పొందుతున్నాయి.

భారత గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, యుఐటిపి, కాగ్ లు చేసిన అధ్యయనాల ప్రకారం, మెట్రో టికెట్ చార్జీల రూపంలో వచ్చేది సాధారణంగా నిర్వహణ ఖర్చుల్లో 30 శాతం నుండి 60 శాతం మాత్రమే భర్తీ చేస్తాయి. మిగిలిన మొత్తం ప్రభుత్వాలు సమకూరుస్తున్నాయి. ప్రపంచ దేశాలు మెట్రో ప్రాజెక్టులను లాభాల కోసం కాకుండా, ప్రజా ప్రయోజనాల కోసం, దీర్ఘకాలిక పట్టణ స్థిరత్వం కోసం కింది 5 ముఖ్య లక్ష్యాలతో ప్రోత్సహిస్తున్నాయి.

1.పట్టణ రవాణా: సౌలభ్యం, రద్దీ తగ్గింపు, వేగవంతమైన, విశ్వసనీయమైన, అధిక సామర్థ్య ప్రజా రవాణా. రోడ్డు రద్దీ, ప్రయాణ సమయం తగ్గింపు. 2. పర్యావరణ ప్రయోజనాలు: వాయు కాలుష్యం, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు తగ్గించడం. 3. భద్రత-సౌకర్యం: రోడ్డు ప్రమాదాల కంటే సురక్షితమైన ప్రయాణం. ముందస్తుగా అంచనా వేసే సౌకర్యం, ఎయిర్ కండిషన్డ్ రైళ్లు. 4. సమగ్ర వృద్ధి-చేరువ: మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాలకు చవకైన ప్రయాణ సౌకర్యం. పట్టణ పేదలు, మహిళలకు మెరుగైన కనెక్టివిటీ.5. పట్టణాభివృద్ధి-ఆర్థిక వృద్ధి: మెట్రో స్టేషన్ల చుట్టూ అభివృద్ధి, స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం, ఆస్తి విలువలు పెరగడం, ఉపాధి అవకాశాలు సృష్టి.

ఈ లక్ష్యాలను అనుసరించే దేశాలు సోషలిస్టు దేశాలు కావు. అవి ప్రపంచ బ్యాంకు మొదలైన సంస్థల నయా ఉదారవాద విధానాలనే అమలు చేస్తున్నాయి. కానీ భారత ప్రభుత్వం మాత్రం ప్రజా రవాణాను లాభం-నష్టం స్కేల్‌తో కొలుస్తూ, అన్ని ప్రాజెక్టులను పిపిపి పద్ధతులకే కట్టుబడటం అత్యంత శోచనీయం, దేశ ద్రోహం. కేవలం ఒక రవాణా రంగమే కాదు. అన్ని రంగాలలోనూ ఇదే వరవడి.



సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై...ఏకధ్రువ ప్రపంచం అనే ముసుగులో ప్రపంచీకరణ ముందుకొచ్చింది. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ హయాంలో పి.వి.నరసింహారావు నేతృత్వంలో మన్మోహన్ సింగ్ సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశ పెట్టారు.

ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం, ప్రభుత్వం ప్రజా బాధ్యత నుండి వైదొలగి ప్రజలను మార్కెట్ శక్తులకు వదిలి వేయడమే ఆ విధానాలలో కీలకమైనది. కానీ 2004లో వామపక్షాలపై ఆధారపడిన యు.పి.ఎ ప్రభుత్వం కనీస ఉమ్మడి కార్యక్రమానికి అంగీకరించాల్సి వచ్చింది. అందులో భాగంగా ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణకు కొన్ని మార్గదర్శకాలను రూపొందించి అమలు చేశారు.

నరేంద్ర మోడీ నేతృత్వంలో 2014లో ఏర్పడిన ఎన్.డి.ఎ ప్రభుత్వం ప్రైవేటుకు గేట్లు ఎత్తింది. ప్రభుత్వ రంగ పరిశ్రమలు పుట్టింది చావడానికేనని స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీనే ప్రకటించారు. తాజాగా తెలుగు గడ్డ మీద విశాఖలో ఆర్థిక మంత్రి నిర్మలమ్మ "ప్రైవేటీకరణ మా విధానమని" మరొకసారి కుండ బద్దలు కొట్టారు. "నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్" పేర నేడు ప్రైవేటీకరణ కొత్త మార్గంలో నడుస్తోంది. ప్రైవేట్ వారు ఎలాంటి పెట్టుబడి పెట్టకుండానే, ప్రజల సొమ్ముతో ప్రభుత్వం నిర్మించిన ప్రభుత్వ రంగ మౌలిక సదుపాయాలను (రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్లుగా పైప్‌లైన్లు వగైరాలు) ప్రైవేట్ వారికి లీజుకి ఇస్తున్నారు. అంటే వడ్డించిన విస్తరిలో భోజనం ఆరగించడమే.

ప్రభుత్వం ప్రజా ఆస్తులను ప్రైవేట్ వారికి ధారాదత్తం చేసే ఈ వినాశకర విధానాలను అనుమతించాలా? లేక దీనికి ముగింపు పలకాలా? ఈ ప్రశ్నకు భారత ప్రజలే సమాధానం చెప్పాలి. ప్రజలే చైతన్యవంతులై కదిలి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల మార్పుకు సన్నద్ధం కావాలి.

/వ్యాసకర్త అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య (ఎ.ఐ.ఆర్.టి.డబ్ల్యు.ఎఫ్) ఉపాధ్యక్షులు /

కవిత్వం

అద్దం

తెలుస్తోంది నీ అక్కసు
నీ ముఖం లోని క్రౌర్యాన్ని
వికృత స్వరూపాన్ని
విస్పష్టం చేస్తోందనే కదా...!
ఈ అసహన అనుచిత చర్యలు...?
విషంగక్కే ఆటవిక చేష్టలు...?
అయితే మాత్రం ఏంటట...?
బద్దలైన అద్దంలోని ప్రతి ముక్కా...!
నీ వికృత వదనాన్ని వెక్కిరిస్తూ...!
లోకం ముంగిట
బహిరంగ పరుస్తుంది.
నిజాన్ని నిక్కచ్చిగా
నిలబెట్టే తీరుతుంది
నువ్వనుకోవచ్చు,
అద్దం గుండెను
ఛిద్రం చేయగలిగానని,
నీ ఆధిపత్య భావజాలంతో,
అణగదొక్కగలిగానని
కానీ...! గుర్తుపెట్టకో...!
నిజమనే అద్దం
అమీబా లాంటిది.
దానికి మరణం లేదు.
చిదిమేసే కొద్దీ ప్రతి అణువూ...
నిజాన్ని ఘోషించే నిలువుటద్దమై
నీ ఉన్మాదపు నగ్నత్వాన్ని
జగతి ముందు
నిలబెట్టే తీరుతుంది.

- వి.ఆర్, సెల్ : 9133084262

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

సవరణ

తొమ్మిదవ తారీకున ఎడిట్ పేజీలో వచ్చిన "రాష్ట్రంలో పని గంటల పెంపు అనుచితం" వ్యాసంలో రెండు పొరపాట్లు దొర్లాయి. 3వ పేరా లోని చివరి వాక్యాన్ని కింది విధంగా చదువుకోగలరు.

"10 గంటల చొప్పున పని చేస్తే వారంలో ఒక రోజు, 11.30 గంటల చొప్పున పని చేస్తే వారంలో రెండు రోజులు అదనపు శెలవులు వస్తాయని ఈ మార్పుల్లో కనపడుతోంది".

- ఎడిటర్

ఖాళీగా 30 వేల ఎకరాలు

(మొదటిపేజీ తరువాయి)

భూములు ఇచ్చినందుకుగానూ వైఎస్ఆర్ కుమారుడి వైఎస్ జగన్ కంపెనీల్లో రూ.854 కోట్లు పెట్టుబడులు పెట్టారని 2012లో సిబిఐ అభియోగపత్రం కోర్టులో దాఖలు చేసింది. దీంతో, ఈ వ్యవహారం కోర్టు పరిధిలోకి వెళ్లింది. అప్పటి నుంచి ఈ భూముల వివాదం కోర్టు పరిధిలోనే ఉంది. ఇటీవల ఈ కేసును కొట్టేయాలని వాన్‌పిక్ ప్రాజెక్టు వేసిన పిటిషన్‌ను తెలంగాణా హైకోర్టు కొట్టేసింది. కోర్టు వ్యవహారాలతో ముడిపడి ఉన్నందున ఈ భూములన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. వాటిల్లో ప్రతిపాదించిన పరిశ్రమలేవీ రాలేదు. ఆ భూములకు అప్పట్లో కంచెలు కూడా వేయగా, కొన్నిచోట్ల రైతులు స్వాధీనం చేసుకునే యత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు.

దొనకొండ పరిశ్రమల కేంద్రంలోనూ ఇదే తీరు...

రాష్ట్రం విడిపోయాక అసెంబ్లీలో అప్పటి టిడిపి ప్రభుత్వం కొన్ని ప్రాజెక్టులు ప్రకటించింది. ఇందులో భాగంగా దొనకొండ వద్ద భారీ పరిశ్రమల ఏర్పాటు పేరుతో 25,062 ఎకరాలు సేకరించాలని నిర్ణయించింది. ఇక్కడ రెండో ప్రపంచ యుద్ధం సమయాన ఏర్పాటు చేసిన విమానాశ్రయాన్ని కూడా అభివృద్ధి చేస్తామని చెప్పింది.

ప్రాథమికంగా ఎపిఐఐసికి 2,395.98 ఎకరాలు కేటాయించారు. ఇందులో 1,454.06 ఎకరాలను ఆ సంస్థ స్వాధీనం చేసుకుంది. దొనకొండ వద్ద కేవలం 43.79 ఎకరాల్లో ప్లాట్లు వేశారు. పరిశ్రమల కోసం ఎదురుచూపులే మిగిలాయి. ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. ఇక్కడ నీళ్లులేవు. కరెంటు లేదు. ముడిసరుకుపై స్పష్టత లేక పరిశ్రమలు పెట్టడానికి ఎవరూ రాలేదు. గతంలో పలు సంస్థల ప్రతినిధులు రాగా, అధికారులు భూములు చూపించారు. ఏ ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. ఈ భూములూ నిరుపయోగంగానే ఉన్నాయి.

కనిగిరి నిమ్జ్‌కు భారీగా భూములు

కేంద్రంలో యుపిఎ ప్రభుత్వ హయాంలో కనిగిరి ప్రాంతంలో నిమ్జ్ పేరుతో పారిశ్రామిక ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రకటించారు. దీనికి 12,033 ఎకరాలు కేటాయించారు. ఇందులో భాగంగా పట్టా భూములు 6,366.86 ఎకరాలు, ప్రభుత్వ భూములు 2,662.82 ఎకరాలు, అసైన్డ్ భూములు 3,003.24 ఎకరాలు సేకరించాలని అధికారులు నివేదికలు తయారు చేశారు. రైతులకు సమాచారం ఇచ్చారు. ఇప్పటి వరకూ 4,364.66 ఎకరాలు సేకరించి నిమ్జ్ పరిధిలో పెట్టారు.

ఇందులో ఎపిఐఐసికి 1,839.09 ఎకరాలు అప్పగించారు. కందుకూరు–పామూరు రోడ్డులో మాలకొండ వద్ద ఈ భూముల్లో రోడ్లు వేశారు. ప్లాట్లుగా విభజించారు. ఇక్కడా ఏ పరిశ్రమా రాలేదు. ఇక్కడ 50 వేల మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పిన మాటలు నీటిమూటలయ్యాయి. రామాయపట్నం పోర్టుకూ ఈ నిమ్జ్‌ను అనుసంధానం చేయాలని నిర్ణయించారు. ఇదీ ఆచరణ రూపం దాల్చలేదు. ఇటీవల రిలయన్స్ సంస్థ బయో ఇంధనం ప్యాక్టరీ పెట్టేందుకు సిద్ధమైంది. ఇందుకోసం పీసీపల్లి మండలంలో ఐదు వేల ఎకరాలు భూమిని ఇవ్వాలని నిర్ణయించారు.

ఏటా నిలిచిపోయిన వందల కోట్ల రూపాయల సంపద సృష్టి

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంపద సృష్టి గురించి తరచూ మాట్లాడుతున్నారు. పంట భూములు ఖాళీగా ఉండడంతో వేల కోట్ల రూపాయల వ్యవసాయ ఉత్పత్తుల ఆదాయాన్ని ఏటా వదులుకోవాల్సి వస్తోంది. వాన్‌పిక్ కోసం సేకరించిన భూములు సారవంతమైనవి. ఈ ప్రాంతంలో వరి, వేరుశనగ, కూరగాయలు పండిస్తుంటారు. ఎకరా ఒక్కంటికీ ఏటా రూ.40 వేల వరకూ ఆదాయం వస్తుంది. 22 వేల ఎకరాల్లో ఏటా దాదాపు రూ.88 కోట్ల ఆదాయ వచ్చేది. కనిగిరి, దొండకొండ ప్రాంతాల్లో మెట్ట పంటలను పండింటారు. కంది, ఆముదం, మొక్కజొన్న వంటికి సాగు చేస్తుంటారు. ఈ ప్రాంతాల్లో సేకరించి ఖాళీగా ఉన్న సుమారు 6,750 భూముల్లో పంటలు పండిస్తే ఏటా దాదాపు రూ.20 వేల నుంచి రూ.25 వేల ఆదాయం వస్తుంది. ఏటా అంటే రూ.13.50 కోట్ల నుంచి రూ.16.87 కోట్ల వరకూ లభించేంది. వాన్‌పిక్, కనిగిరి, దొండకొండ భూముల్లో ఖాళీగా ఉండడం వల్ల ఏటా వంద కోట్ల రూపాయలకుపైగా సంపద కోల్పోతున్నాము.

ప్రభుత్వ బ్యాంకు పగ్గాలు ప్రైవేటుకు

(మొదటిపేజీ తరువాయి)

ప్రయివేటు లేదా అంతర్గత అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నారు, ఎస్‌బిఐ సహా పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి 11 జాతీయ బ్యాంకుల్లో ఇడి పోస్టులను భర్తీ చేయడానికి కేంద్రం మార్పులు చేసింది. ఈ పోస్టుకు చీఫ్ జనరల్ మేనేజర్ లేదా జనరల్ మేనేజర్ స్థాయిలో అనుభవం తప్పనిసరి చేశారు.

చట్టవిరుద్ధం : యుఎఫ్‌బియు

ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో సీనియర్ మేనేజ్‌మెంట్ పదవులను ప్రయివేటు సెక్టార్ వాళ్లకు ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తొమ్మిది యూనియన్లతో కూడిన యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ చర్య ప్రభుత్వ రంగ సంస్థల విధానానికి విరుద్ధమని తెలిపింది. కీలక పదవులను బయటి వ్యక్తులకు ఇవ్వడమంటే ప్రయివేటీకరణకు సమానమని విమర్శించాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాక్ట్ 1955, బ్యాంకింగ్ కంపెనీస్ (అక్విజిషన్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్) యాక్ట్ 1970 అండ్ 1980, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ యాక్ట్ 1956లో ఎటువంటి సవరణ లేకుండా ఈ కొత్త మార్గదర్శకాలు జారీ చేయడం చట్టవిరుద్ధం, రాజ్యాంగ ఉల్లంఘన అని యుఎఫ్‌బియు విమర్శించింది. పార్లమెంట్‌లో చర్చ, చట్ట సవరణ లేకుండా ఇలాంటి చర్యలు చేపట్టడం చట్ట విరుద్ధమని తెలిపాయి. ఈ విధానం బ్యాంకుల జాతీయీకరణ ఉద్దేశాన్ని దెబ్బతీయడమే కాక, అంతర్గత కెరీర్ ఆధారిత వారసత్వ మోడల్‌ను ధ్వంసం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రం చర్యలు దేశ ఆర్థిక సౌర్వభౌమత్వం, ప్రజా విశ్వాసాన్ని ప్రమాదంలోకి నెట్టివేస్తుందని యూనియన్లు హెచ్చరించాయి. గతంలో ఐఎఎస్ అధికారులను పిఎస్‌బి టాప్ మేనేజ్‌మెంట్‌లో నియమించిన ప్రయోగం విఫలమైన విషయాన్ని గుర్తు చేసింది. పిఎస్‌బిల్లో ప్రయివేటు వ్యక్తుల నియామకాలకు సంబంధించిన మార్గదర్శకాలను తక్షణమే నిలిపివేయాలని యుఎఫ్‌బియు డిమాండ్ చేసింది.

నాలుగు వారాల్లో తేల్చిచెప్పండి

(మొదటిపేజీ తరువాయి)

అంశంపై నిర్ణయం తీసుకోలేదని గుర్తు చేశారు. పిటిషనర్ల తరపున హాజరైన మరో న్యాయవాది దినేష్ ద్వివేది వాదనలు వినిపిస్తూ కేంద్రప్రభుత్వం తానిచ్చిన స్పష్టమైన హామీని గౌరవించాలని కోరారు. కేంద్రం తనకు అనుకూలంగా... భవిష్యత్‌లో ఉత్తర ప్రదేశ్ లేదా తమిళనాడు రాష్ట్రహోదాని రద్దు చేస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దీనిపై సిజెఐ జోక్యం చేసుకుంటూ ఉత్తర ప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాలను జమ్మూకాశ్మీర్‌తో సమానం చేయలేమని అన్నారు. రాష్ట్రహోదాను పునరుద్ధరించడానికి ఒక బిల్లును ప్రవేశపెట్టే ప్రయత్నం చేయాలని పిటిషనర్లు కేంద్రాన్ని కోరారు. సరిహద్దు వివాదాలు కొనసాగుతూనే ఉంటాయని, కేంద్రం నెరవేర్చలేకపోతే అలాంటి హామీలు ఇవ్వకూడదని అన్నారు. కేంద్రం తరపున తుషార్ మెహతా వాదిస్తూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంతో సంప్రదిస్తోందని, నాలుగు వారాల్లోగా పిటినర్లు లేవనెత్తిన ప్రతి ఒక్క అంశానికీ సమాధానమిస్తామని తెలిపారు.

తిరుపతి 'శ్రీనివాస సేతు' పై ప్రమాదం

ప్రజాశక్తి –తిరుపతి సిటీ

తిరుపతిలోని శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ పై ద్విచక్ర వాహనం మీద వెళ్తూ, అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు చంద్రగిరి నియోజకవర్గం కందుల వారి పల్లికి చెందిన కనిష్క్ (22), కొట్టాల గ్రామానికి చెందిన వాస్తవ కామినేని (22) రంగంపేట వద్ద ఉన్న శ్రీ విద్యానికేతన్‌లో డిగ్రీ చదువుతున్నారు. శుక్రవారం ఇద్దరూ బైక్‌లో శ్రీనివాస సేతుపై ప్రయాణించారు. లక్ష్మీపురం సర్కిల్ సమీపంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, ఫ్లై ఓవర్ పై నుంచి పడ్డారు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




అర్హులందరికీ
ఇళ్ల స్థలాలివ్వాలని ధర్నా

- ఆరు నెలల్లో కేటాయిస్తామని ఆర్‌డిఒ హామీ

ప్రజాశక్తి – తిరుపతి టౌన్

గ్రామాలకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలం కేటాయిస్తామని ప్రకటించిన టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలైనా స్థలాలు చూపలేదని తిరుపతి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో పేదలు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, సిపిఎం నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ 2024లో ఎన్నికలకు ముందు స్థానికంగా ఉన్న పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని తిరుమల నగర్ పంచాయతీ పరిధిలోని తుడా క్వార్టర్స్ వద్ద ఉన్న సర్వే నెంబర్ 195/2, సర్వే నెంబర్ 195/4లో 41 ఎకరాల ప్రభుత్వ భూమిలో స్థానికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో చేసిన పోరాటం చేశామని గుర్తు చేశారు. తిరుపతి అర్బన్ మండల పరిధిలో ఉన్న ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలోని 2,740 మందిని రాష్ట్ర ప్రభుత్వం అర్హులుగా గతంలో గుర్తించి, సర్వే చేసి పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో పులివర్తి నాని ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత వంద రోజుల విజయోత్సవ సభలో సిపిఎం ఆయనను కలవగా తుడా క్వార్టర్స్ వద్ద ఉన్న భూమిలోనే స్థానికులకు ఎన్‌టిఆర్ గృహాలు కట్టిస్తామని హామీ ఇచ్చారని, 15 నెలలు పూర్తవుతున్నా ఏ ఒక్కరికీ సెంటు జాగా ఇవ్వలేదని విమర్శించారు. ధర్నా కార్యక్రమం వద్దకు వచ్చిన ఆర్‌డిఒ తుడా క్వార్టర్స్ దగ్గర ఇచ్చిన హామీ మేరకు అర్హులు ఇచ్చిన అర్జీలను పరిశీలించి ఆరు నెలల్లోపు త్వరలో ఇంటి స్థలాలిప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు ఎస్.మాధవ్, పి.బుజ్జి, ఎం.నరేంద్ర, ఎం.జయంతి, మునిరత్నం, మోహన్, చల్లా చిన్న వెంకయ్య, బాదుల్లా, లోకయ్య, హమీద్, వెంకటేష్, గంగాధరం తదితరులు పాల్గొన్నారు.



దేశ వ్యాప్తంగా కార్నివల్స్‌పై శ్రేయాస్ దృష్టి

- విజయవాడ ఉత్సవ్ సక్సెస్‌తో ముందుకు
- విదేశీ కళాకారులతో ఎపిలో ఏడాది పొడవునా వేడుకలు
- శ్రేయాస్ మీడియా ఫౌండర్ గండ్ర శ్రీనివాస్ రావు

ప్రజాశక్తి – బిజినెస్ బ్యూరో

దేశ వ్యాప్తంగా ఫెస్టివల్ కార్నివల్స్‌ను నిర్వహించనున్నట్లు శ్రేయాస్ మీడియా వెల్లడించింది. ఇటీవల విజయవాడ ఉత్సవ్.. గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కడంతో తన సత్తాను చాటినట్లు పేర్కొంది. దేశ, విదేశాల్లో మూవీ ప్రమోషన్స్, ఈవెంట్స్ కంపెనీగా 3,500లకు పైగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన తమ సంస్థ కార్నివల్స్ ద్వారా బిహూ, ఓనం, గణేష్ చతుర్థి, పొంగల్, లోహ్రీ, దుర్గా పూజ, సంక్రాంతి లాంటి ప్రాంతీయ పండగలకు కొత్త శోభ తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ సంస్థ వెల్లడించింది.

విదేశీ కళాకారులతో ఎపిలో అరకు, గండికోట వంటి ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో ఏడాది పొడవునా వేడుకలు నిర్వహించాలని నిర్ణయించామని శ్రేయాస్ మీడియా ఫౌండర్ గండ్ర శ్రీనివాస్ రావు తెలిపారు. విజయవాడ ఉత్సవ్ స్ఫూర్తితో వైజాగ్, తిరుపతిలో న్యూ ఇయర్, సంక్రాంతి, విజయవాడలో న్యూ ఇయర్, సంక్రాంతి, దీపావళి వేడుకలు జరుపనున్నామన్నారు. ఏడాదంతా 30 భారీ కాన్సర్ట్స్ చేయాలని నిర్దేశించుకున్నామన్నారు. పైలట్ ప్రాజెక్టుగా నిర్వహించిన విజయవాడ ఉత్సవ్ ద్వారా ఇంటలెక్చువల్ ప్రాపర్టీ క్రియేట్ చేశామన్నారు. ఈ కార్యక్రమం స్థానికంగా రూ.1,000 కోట్ల వ్యాపారం జరిగేలా చేసిందన్నారు. వచ్చే ఏడాదిలో విజయవాడ ఉత్సవ్ ద్వారా రూ.5,000 కోట్ల వ్యాపారం లక్ష్యంగా చేసుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే దేశంలో అన్ని నగరాల్లో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు శ్రేయాస్ మీడియా సిద్ధంగా ఉందన్నారు. మహా కుంభ మేళా ప్రకటన హక్కులు దక్కించుకుని వేలాది బ్రాండ్స్‌ను కోట్లాది మందికి చేరువ చేశామన్నారు.

అమెరికాలో భారీ పేలుడు

- పలువురి మృతి

టెన్నెస్సీ : అమెరికాలోని టెన్నెస్సీ రాష్ట్రంలో ఘోర ప్రమాదం జరిగింది. మిలిటరీ ప్లాంట్ లో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో పలువురు మరణించినట్లు సమాచారం. పేలుడు తరువాత 19 మంది ఆచూకీ తెలియడం లేదని స్థానిక అధికారులు ప్రకటించారు. పేలుడు ధాటికి పరిసర ప్రాంతాల్లోని ఇళ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే రంగంలోకి దిగిన అధికారులు ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అధికారులు తెలిపిన సమాచారం మేరకు ఉదయం ఎనిమిది గంటలకు (స్థానిక కాలమానం) ఈ ప్రమాదం జరిగింది. టెన్నెస్సీ రాష్ట్రం సౌత్ నాష్ విల్లేకి 60 మైళ్ల దూరంలో ఉన్న అక్యురేట్ ఎనర్జిటిక్ సిస్టమ్స్ ప్లాంట్ వద్ద ఒక్క సారిగా భారీ పేలుడు సంభవించింది. పేలుడు జరిగిన ప్లాంట్ నుంచి వచ్చిన దట్టమైన పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేసింది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

ఫిలిప్పీన్స్‌ను కుదిపేసిన భూకంపం

- కుప్పకూలిన భవనాలు

మనీలా : ఫిలిప్పీన్స్ దక్షిణ తీరాన్ని శుక్రవారం ఉదయం భారీ భూకంపం కుదిపేసింది. భయాందోళనకు గురైన ప్రజలు తమ నివాసాలు, కార్యాలయ భవనాల నుండి పరుగులు తీశారు. తొలుత సునామీ హెచ్చరికలు జారీ చేసిన అధికారులు ఆ తర్వాత ఉపసంహరించారు. సముద్రంలో పది కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రీకృతమైందని ఫిలిప్పీన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వల్కనాలజీ అండ్ సిస్మాలజీ తెలిపింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.6గా నమోదైంది. ఆ తర్వాత 4.9, 4.2 తీవ్రతతో భూమి మరో రెండుసార్లు కంపించింది. 54 లక్షల మంది నివసిస్తున్న దవావ్ ఓరియంటల్ నగరంలో భూకంప తీవ్రత అధికంగా ఉంది. భూకంపం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అనేక నిర్మాణాలు కూలిపోగా కొన్ని పాఠశాలలు, భవనాలు బీటలు వారాయి. [illegible] పాఠశాలలను మూసివేశారు. దవావ్ ఓరియంటల్‌లో ముందు జాగ్రత్త చర్యగా విద్యార్థులను ఖాళీ చేయించి ఇండ్లకు పంపారు. భూకంప ప్రభావానికి సంబంధించిన అనేక వీడియోలు సామాజిక మాధ్యమాల్లో దర్శనమిస్తున్నాయి. తగమ్ సిటీ దవావ్ ఆస్పత్రికి చెందిన సిబ్బంది, రోగులు భయంతో పరుగులు తీస్తున్న దృశ్యం ఓ వీడియోలో కన్పించింది. అధికారులు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నారు, సహాయక పనులను సమన్వయం చేస్తున్నారని దేశాధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ చెప్పారు. ఇండోనేషియాలోని ఉత్తర సులావేసి రాష్ట్రంలో సునామీ అలలు 3.5 నుంచి 17 సెంటీమీటర్ల ఎత్తుకు ఎగిసిపడగా బీచ్‌లు, నదీ తీరాల వైపు పోవద్దని అధికారులు హెచ్చరించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

30 మంది గిరిజన విద్యార్థులకు పచ్చకామెర్లు

ప్రజాశక్తి - కురుపాం
(పార్వతీపురం మన్యం జిల్లా)

గిరిజన విద్యార్థులు అస్వస్థతకు గురవుతూనే ఉన్నారు. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండల కేంద్రంలో పచ్చకామెర్లతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. 170 మంది చికిత్స పొందారు. విద్యార్థులు మరణించినప్పటికే పాఠశాలల్లో సరైన వసతులు, సౌకర్యాలు కల్పించడం లేదు. ఈ క్రమంలో కురుపాం మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాలలోని 30 మంది విద్యార్థులు పచ్చకామెర్లు, జ్వరాల బారిన పడ్డారు. జిల్లా కేంద్రాస్పత్రిలో 17 మంది, కెజిహెచ్‌లో ఇద్దరు, కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో నలుగురు విద్యార్థులు చికిత్స పొందుతున్నారు. వైద్యం పొందిన తర్వాత ఏడుగురు విద్యార్థులు కోలుకోవడంతో వారిని డిశ్చార్జ్ చేశారు. ఈ పాఠశాలలో మొత్తం 360 మంది విద్యార్థులు ఉన్నారు. తమ పిల్లల ఆరోగ్య పరిస్థితి ఏమిటో అని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

రూ.2,221.03 కోట్లు ఇవ్వాలి

- రుణ సామర్థ్యాన్ని పునరుద్ధరించాలి
- ఎయిమ్స్ ఏర్పాటు చేయండి
- వరి సేకరణ సబ్సిడీ బకాయిలను వెంటనే మంజూరు చేయాలి
- ప్రధాని మోడీతో కేరళ సిఎం పినరయి విజయన్



ప్రధాని మోడీతో చర్చిస్తున్న పినరయి విజయన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రూ.2,221.03 కోట్లు ఇవ్వాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ డిమాండ్ చేశారు. ఎయిమ్స్ ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. శుక్రవారం నాడిక్కడ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కలిశారు. ఈ సందర్భంగా కేరళ పురోగతి, ఉపశమనం, ఆర్థిక స్థిరత్వం వంటి ముఖ్యమైన అంశాలపై తక్షణ జోక్యం చేసుకోవాలని కోరారు. ఉత్తర కేరళలో ప్రాచుర్యం పొందిన భైరవన్ థెయ్యం శిల్పాన్ని ప్రధాన మంత్రికి సిఎం అందజేశారు. నలుగురు కేంద్ర మంత్రులనూ సిఎం పినరయి విజయన్ కలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఎం పినరయి విజయన్ విలేకరులతో మాట్లాడుతూ.. ముండకై చూరల్మాల విపత్తు బాధితుల పునరావాసం కోసం జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్‌డిఆర్‌ఎఫ్) నుండి రూ.2,221.03 కోట్లు కేటాయించాలని తాను పునరుద్ఘాటించానని తెలిపారు. దీనిని రుణంగా కాకుండా ఉపశమనం, పునర్నిర్మాణానికి గ్రాంటుగా పరిగణించాలని కూడా అభ్యర్థించానన్నారు. ఆర్థిక ఇబ్బందుల గురించి ప్రధాని మోడీని ఒప్పించడానికి కూడా ప్రయత్నించానని తెలిపారు. 'రుణ సామర్థ్యాన్ని పునరుద్ధరించడం, ఐజిఎస్‌టి రికవరీని తిరిగి చెల్లించడం, అదనపు బడ్జెట్ రుణాల్లో కోతను వాయిదా వేయాలి. జిఎస్‌డిపిలో అదనంగా 5 శాతం రుణం తీసుకోవడానికి అనుమతించాలి. జాతీయ రహదారి భూసేకరణ ఖర్చులో 25 శాతం భరించడానికి కేంద్రం ప్రత్యేక శ్రద్ధ చూపాలి' అని ఆయన డిమాండ్ చేశారు.


'కోజికోడ్‌లోని కినలూర్‌లో గుర్తించిన స్థలంలో ఎయిమ్స్ ఏర్పాటుకు ఆమోదం వేగవంతం చేయాలి. వేగవంతమైన పట్టణీకరణను దృష్టిలో ఉంచుకుని, శాస్త్రీయ పట్టణ ప్రణాళిక, నిర్మాణ పరిశోధనలను బలోపేతం చేయడానికి రాష్ట్రంలో ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ స్కూల్ (ఎస్‌పిఎ)ను ఏర్పాటు చేయాలి. సాంకేతిక అడ్డంకుల కారణంగా బకాయిపడిన వరి సేకరణ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలి. రవాణా ఛార్జీలకు సంబంధించిన రూ.257.41 కోట్లు ఇవ్వాలి. ఈ మొత్తంలో బకాయిలు వరి రైతులకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను కలిగిస్తున్నాయి' అని తెలిపారు. ఈ డిమాండ్లు రాష్ట్ర సంక్షేమం కోసం మాత్రమే కాకుండా, విపత్తు నిర్వహణ, ఆర్థిక సమాఖ్యవాదం, ఆరోగ్య రంగంలో పురోగతి, విద్యా సమానత్వం, ఆహార భద్రత, స్థిరమైన పట్టణీకరణ అనే జాతీయ లక్ష్యాలతో కూడా ముడిపడి ఉన్నాయని ప్రధాని మోడీకి వివరించారు. 'రాష్ట్రానికి ఉన్న కీలకమైన అవసరాలను కేంద్రం ఇప్పటి వరకు పరిగణనలోకి తీసుకోలేదు. అటువంటి పరిస్థితిలోనే డిమాండ్లు లేవనెత్తాం, వాటి తీవ్రతను ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులకు వివరించాం. రాష్ట్రానికి ఇచ్చిన వాగ్దానాలను కేంద్రం నెరవేరుస్తుందని ఆశిస్తున్నాను' అని సిఎం పినరయి విజయన్ అన్నారు.

పని గంటల పెంపును ఉపసంహరించుకోండి : కెవిపిఎస్

అమరావతి బ్యూరో : పరిశ్రమలు, వ్యాపార సంస్థల్లో 8 గంటల పని విధానాన్ని 10 నుంచి 13 గంటలకు పెంచుతూ శాసనసభ సమావేశాల్లో బిల్లును ఆమోదించడాన్ని కెవిపిఎస్ నాయకులు నల్లప్ప, మాల్యాద్రి ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023లో కర్ణాటక కార్మిక చట్టాలను సవరించి పని గంటలను రోజుకు 12 గంటలకు పెంచిందన్నారు. గుజరాత్ ప్రభుత్వం 2025లో పని గంటల పెంపు బిల్లును ఆమోదించిందన్నారు. కూటమి ప్రభుత్వం శాసనసభా సమావేశాల్లో ప్రవేశపెట్టిన బిల్లును కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వ్యతిరేకించారని, ఇతరులు అనుకూలంగా వ్యవహరించడం సిగ్గు చేటని అన్నారు.

పాలస్తీనా ఉద్యమకారుడు బాల్గౌటి విడుదలకు ఇజ్రాయిల్ నిరాకరణ

- 20 ఏళ్లగా జైలులోనే



గాజా : స్వతంత్ర పాలస్తీనా ఉద్యమకారుడు మార్వాన్ బాల్గౌటిని విడుదల చేసేందుకు ఇజ్రాయిల్ నిరాకరించింది. అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ గాజా శాంతి ప్రణాళికను అమలు చేసేందుకు ఇజ్రాయిల్, హమాస్‌లు అంగీకరించా యని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందంలో కాల్పుల విరమణతోపాటు మరో కీలకమైన అంశం ఇరు పక్షాల చెరలో ఉన్న ఖైదీలను విడుదల చేయడం. దీనిలో భాగంగా 20 ఏళ్లగా జైలు శిక్ష అనుభవిస్తున్న మార్వాన్ బాల్గౌట్‌ను విడుదల చేయాలని హమాస్ పట్టుబట్టింది. అయితే ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెన్ గ్విర్ గురువారం మీడియాతో మాట్లాడుతూ 'బాల్గౌటి రెడ్ లైన్ లిస్ట్‌లో ఉన్న ఉగ్రవాది, మా దేశ భద్రతరిత్యా' విడుదల చేయబోమని తెలిపారు.

మార్వాన్ బాల్గౌటి ఎవరు..?

వెస్ట్‌బ్యాంక్‌లోని కోబార్‌లో జన్మించిన 66 ఏళ్ల బాల్గౌటి స్వతంత్ర పాలస్తీనా కోసం దశాబ్దాలుగా పోరాడు తున్నారు. టాంజిమ్ ఫతా అనే సాయుధ శాఖకు నాయకత్వం వహించి ఇజ్రాయిల్ సైన్యానికి చెమటలు పట్టించారు. ప్రస్తుత పాలస్తీనా అధ్యక్షులు మహ్మద్ అబ్బాస్ కంటే అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడు. పౌరుల హత్యానేరం నెపంతో 2002లో ఇజ్రాయిల్ సైన్యం అతన్ని అరెస్ట్ చేశాయి. కోర్టు జీవిత ఖైదును విధించింది. అయితే బాల్గౌటి జైలులో అనేక రచనలు రాశారు. అవి రహస్యంగా ముద్రించారు. 1967 నాటి సరిహద్దుల ఆధారంగా గాజా, వెస్ట్‌బ్యాంక్, తూర్పు జెరూసలెంతో కూడిన స్వతంత్ర దేశంగా పాలస్తీనాను ప్రకటించాలని తన రచనల ద్వారా సమాజానికి తెలియజేశారు. యాసర్ అరాఫత్ స్థాపించిన ఫతా పార్టీకి సరైన నాయకుడని, ప్రజలను ఐక్యంగా నడపగల నేతగా పాలస్తీనియన్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాల్గౌటిని విడుదల చేసేందుకు ఇజ్రాయిల్ భయపడుతుందని పలవురు భావిస్తున్నారు.

వ్యవస్థాగత హత్య

పూరణ్ కుమార్ మృతిపై వెల్లువెత్తుతున్న నిరసనలు
నివేదిక ఇవ్వండి : జాతీయ ఎస్‌సి కమిషన్ ఆదేశం
బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి : సిపిఎం డిమాండ్

రోహ్‌తక్, న్యూఢిల్లీ, అమరావతి బ్యూరో : సమాజంలో కొనసాగుతున్న కులవివక్ష, అణచివేత వల్లే సీనియర్ ఐపిఎస్ అధికారి, హర్యానా ఎడిజిపి వై. పూరణ్‌కుమార్ అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోయారని పలువురు విమర్శిస్తున్నారు. ఉన్నత స్థానంలో ఉన్న వారి పట్ల సైతం వేధింపులకు పాల్పడడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. నివేదిక ఇవ్వాలని ఎన్‌సిఎస్‌సి కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించింది.

వ్యవస్థాగత హత్య : సిపిఎం

పూరణ్ కుమార్ మరణానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సత్వర, నిష్పాక్షిక దర్యాప్తు చేయాలని సిపిఎం హర్యానా రాష్ట్ర కార్యదర్శి ప్రేమ్‌చంద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శివర్గం తరపున ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుమార్‌ది ఆత్మహత్య కాదని, ఇనిస్టిట్యూషనల్ మర్డర్ అని పేర్కొన్నారు. సమాజంలో కొనసాగుతున్న కులవివక్ష, అణచివేతే ఇందుకు కారణమని విమర్శించారు. కుమార్ మరణానికి దారితీసిన పరిస్థితులపై సత్వర, నిష్పాక్షిక దర్యాప్తు నిర్వహించాలని, , ఆయన కుటుంబానికి తగిన భద్రత కల్పించాలని కోరారు.



కుమార్ ఫైనల్ నోట్‌లో పేర్కొన్న వివరాలు దిగ్భ్రాంతికరమని, కులం ఆధారంగా తీవ్రమైన వేధింపులు, అవమానాలు, వివక్షను ఎదుర్కొన్నారని స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. కులపక్షపాతం, అణచివేతపై అప్పటి హోం మంత్రితోసహా అన్ని స్థాయిలలో లిఖిత పూర్వకంగా ఆయన ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని, చివరికి ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హిందూత్వ, సనాతన ధర్మం పేరుతో దళితులు, గిరిజనులు, మైనారిటీలపై దాడి జరుగుతోందని తెలిపారు. బాధ్యులపై చర్య తీసుకునే బదులు వారికి రక్షణగా పరిపాలన, రాజకీయ వ్యవస్థ ఉంటున్నాయని విమర్శించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై షూ విసిరిన సంఘటనను గుర్తు చేస్తూ సీనియర్ అధికారులు, న్యాయమూర్తులు కూడా సురక్షితంగా లేనప్పుడు సాధారణ పౌరుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కుమార్ మృతిపై తీసుకోబోతున్న నిర్దిష్ట చర్యలపై ప్రభుత్వం లేదా ముఖ్యమంత్రి ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటన చేయలేదని విమర్శించారు. ఈ ఉదాసీనతపై, అన్ని రకాల వివక్షలు, పక్షపాత ధోరణులకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని ప్రజాసంఘాలు, సామాజిక సంస్థలు, మేధావులు, ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

నివేదిక ఇవ్వండి : ఎన్‌సిఎస్‌సి ఆదేశం

హర్యానా ఎడిజిపి వై.పూరణ్‌కుమార్ ఆత్మహత్యకు కులపరమైన వివక్ష, వేధింపులే కారణమని వచ్చిన ఆరోపణలపై ఏడు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని షెడ్యూల్డ్ కులాల నేషనల్ కమిషన్ (ఎన్‌సిఎస్‌సి) చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంత ప్రధాన కార్యదర్శి, డిజిపిలను ఆదేశించింది. మీడియా నివేదికల ఆధారంగా సుమోటోగా ఈ కేసు దర్యాప్తు చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. నివేదిక సకాలంలో సమర్పించకపోతే సమన్లు జారీ చేసే అధికారం తమకు ఉందని గుర్తు చేసింది. పూరణ్‌కుమార్ మరణించిన తరువాత సేకరించిన ఫైనల్ నోట్‌లో గత కొన్నేళ్లుగా సీనియర్ అధికారులు మానసికంగా వేధించినట్లు, అవమానించినట్లు వివరాలున్న సంగతి తెలిసిందే.

కారకులను కఠినంగా శిక్షించాలి : కెవిపిఎస్

పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారణమైన మనువాద మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. మనువాద మతోన్మాద బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ పాలనలో కులదురహంకార దాడులు, మరణాలు పెరిగాయని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఒ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూరన్ కుమార్‌ది ఆత్మహత్య కాదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హత్యగా పేర్కొన్నారు. పూరన్ కుమార్ ఆత్మహత్యను కెవిపిఎస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఉన్నత స్థాయి పోలీసు అధికారి, రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ఉన్న వ్యక్తికే దుర్మార్గమైన కుల వివక్ష, హింస, అవమానం జరుగుతుంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇది దేశ లౌకిక రాజ్యాంగ విలువలపై బహిరంగ దాడి తప్ప మరొకటి కాదన్నారు. వెంటనే రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఎడిజిపి ఆత్మహత్యను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకుని విచారణ చేపట్టాలని కోరారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న సూసైడ్ నోట్‌ను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

మహారాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల పోరుబాట

(మొదటిపేజీ తరువాయి)

మహారాష్ట్ర ప్రభుత్వం అందుకు ప్రయత్నిస్తోందని కేంద్ర కార్మిక సంఘాల నేతలు విమర్శించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యాన పనిచేస్తున్న మూడు విద్యుత్ కంపెనీల యాజమాన్యాలు ప్రైవేటీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నాయి. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యుత్ కంపెనీల్లో పనిచేస్తున్న లక్ష మంది విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్లు, అధికారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విద్యుత్ రంగంలోని ఏడు ప్రధాన సంఘాల ఆధ్వర్యాన ఈ నెల 9 నుంచి 11 వరకు రాష్ట్రవ్యాప్తంగా 72 గంటల సమ్మెను ప్రారంభించారు. కోకన్, సింధుదుర్గ్, చిప్లన్, కొల్హాపూర్, సాంగ్లి, బారామతి, సోలాపూర్, నాసిక్, విదర్భ, పశ్చిమ మహారాష్ట్ర సహా అనేక ప్రాంతాల్లో 80 శాతం కంటే ఎక్కువ మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సమ్మెలోకి..

జెఎసి ఆగస్టులో ముఖ్యమంత్రి, ఇంధన మంత్రి, మూడు కంపెనీల ఛైర్మన్లకు సమ్మె నోటీసు జారీ చేసింది. ఉద్దేశపూర్వకంగా చర్చలను ఆలస్యం చేయడానికి వారు ప్రయత్నించారు. దీనివల్ల యూనియన్లు సమ్మె నోటీసు జారీ చేయా ల్సి వచ్చింది. ఈ నెల 6న ముంబయిలో జరిగిన చర్చల్లో ప్రభుత్వం ఎటువంటి సానుకూల నిర్ణయం తీసుకోకపోవడంతో యూనియన్లు 72 గంటల సమ్మెను ప్రకటించాయి.

డిమాండ్లివి...

డిస్ట్రిబ్యూషన్ కంపెనీలోని 24 డివిజన్లను అదాని, టోరెంట్ కంపెనీలకు అప్పగిస్తూ లైసెన్సులు ఇవ్వడాన్ని నిలిపివేయాలని, 329 విద్యుత్ సబ్ స్టేషన్లను అప్పగించవద్దని, రూ.200 కోట్లు విలువైన ప్రాజెక్టులను అప్పగించవద్దని, ట్రాన్స్‌మిషన్ కంపెనీని ప్రైవేట్ కంపెనీలకు అప్పగించవద్దని, ట్రాన్స్‌మిషన్ కంపెనీని షేర్ మార్కెట్‌లో జాబితా చేయవద్దని జెఎసి డిమాండ్ చేస్తోంది. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని, అన్ని రిజర్వేషన్ పోస్టులను భర్తీ చేయాలని, డిస్ట్రిబ్యూషన్ సంస్థలో పునర్నిర్మాణ ప్రక్రియను ఏకపక్షంగా అమలు చేయడాన్ని ఆపాలని పేర్కొంది. రాష్ట్రప్రభుత్వం ప్రైవేటీకరణ ప్రయత్నాలను విరమించుకోవాలని జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులందరూ డిమాండ్ చేశారు. యుపి ప్రభుత్వ ప్రైవేటీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా 300 రోజులకు పైగా ఆ రాష్ట్ర విద్యుత్ కార్మికులు చేస్తున్న వీరోచిత పోరాటాన్ని కేంద్ర కార్మిక సంఘాల నేతలు ప్రశంసించారు.

కాబూల్‌లో పాక్ ఎయిర్ స్ట్రయిక్స్!

- 30 మంది మిలిటెంట్లను మట్టుబెట్టాం : పాకిస్తాన్

ఇస్లామాబాద్ : ఆఫ్ఘన్ సరిహద్దుకు సమీపంలో పాక్ మిలటరీ కాన్వాయ్‌పై దాడి చేసిన ఘటనకు సంబంధమున్న 30మంది మిలిటెంట్లను తమ భద్రతా బలగాలు హతమార్చినట్లు పాకిస్తాన్ మిలటరీ శుక్రవారం తెలిపింది. అక్టోబరు 7న జరిగిన ఆనాటి ఘటనలో తొమ్మిది మంది సైనికులు, ఇద్దరు అధికారులు చనిపోయారు. ఆ దాడికి తమదే బాధ్యత అని మిలిటెంట్ గ్రూపు తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్తాన్ ప్రకటించింది. విశ్వసనీయమైన ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు వ్యవహరించామని, ఉధృతంగా కాల్పులు జరిగిన తర్వాత 30మంది తీవ్రవాదులను హతమార్చినట్లు పాక్ మిలటరీ ఒక ప్రకటనలో తెలిపింది.

రెచ్చగొట్టే చర్యలివి : తాలిబన్

కాబూల్‌లో, తూర్పు ప్రావిన్స్ అయిన పటికాలో జరిగిన పేలుళ్లకు పాకిస్తాన్ కారణమంటూ తాలిబన్ విమర్శించింది. గురువారం రాత్రి పొద్దుపోయిన తర్వాత కాబూల్‌లో పెద్ద పేలుడు శబ్దం వినిపించిందని, దానికి గల కారణాలపై దర్యాప్తు సాగుతోందని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి ముజాహిద్ చెప్పారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలవలేదని చెప్పారు. కాబూల్ సార్వభౌమాధికారం కలిగిన ప్రాంతమని, దాన్ని ఉల్లంఘిస్తూ దాడులు జరిపారని తాలిబన్ ప్రభుత్వం విమర్శించింది. సరిహద్దు ప్రాంతమైన పటికా ప్రావిన్స్‌లో మార్కెట్‌పై పాక్ బాంబు దాడులకు దిగిందని, తాలిబన్ రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

మచడోకి నోబెల్ శాంతి బహుమతి

- ట్రంప్‌పైనే ఆధారపడుతున్నాం : వెనిజులా నేత



స్టాక్‌హోం : వెనిజులా ప్రతిపక్ష నేత, అమెరికాకు నమ్మిన బంటు మరియా కొరినా మచడోకి ఈ ఏడాది నోబెల్ శాంతి పురస్కారం లభించింది. వెనిజులా ప్రజల ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్నందుకు ఈ బహుమతి ఇస్తున్నట్లు స్వీడిష్ నోబెల్ అకాడమీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ఏడాది నోబెల్ శాంతి పురస్కారానికి మొత్తంగా 338 నామినేషన్లు నమోదయ్యాయి. వాటిలో 244మంది వ్యక్తులు కాగా, 94 సంస్థలు. ఈ సందర్భంగా మచడో మాట్లాడుతూ గతం కంటే ఎక్కువగా ట్రంప్‌పై తాము ఆధారపడుతున్నామని అన్నారు. ట్రంప్, అమెరికా, లాటిన్ అమెరికా, ప్రజాస్వామ్య దేశాలు తమకు మిత్రులని అన్నారు. తన బహుమతిని ట్రంప్‌కు అంకితమిస్తున్నట్లు ప్రకటించారు.

అమెరికా యత్నాలకు మద్దతుగానే నోబెల్

హ్యూగోచావెజ్ నేతృత్వంలో వెనిజులాలో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అక్కడి సహజ సంపదను కబళించేందుకు అమెరికా, పశ్చిమ దేశాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఆ తరువాత ఏర్పడిన మదురో ప్రభుత్వం కూడా ప్రజల కోసమే వనరులను వినియోగిస్తోంది. ఇది కంటగింపుగా మారిన పశ్చిమ దేశాలు అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక కుట్రలకు పాల్పడుతూ, ప్రతిపక్ష పార్టీలకు పూర్తిస్థాయిలో నిధులు, సైనిక సహాయాన్ని అందిస్తున్నాయి. అల్లర్లు సృష్టించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. ఇటీవల డ్రగ్స్ ఎగుమతి చేస్తున్నారంటూ ట్రంప్ అమెరికా నౌకలను సైతం వెనిజులా తీర ప్రాంతంలో మోహ రించి, బెదిరింపులకు పాల్పడు తున్నారు. తాజాగా నోబెల్ బహుమతి మచడోకి ఇవ్వడం ద్వారా అక్కడి ప్రభుత్వంపై ఒత్తిడి చేసేందుకు తీవ్రంగా ప్రయత్ని స్తున్న పశ్చిమ దేశాల కుట్రకు నోబెల్ అకాడమీ పెద్దలు సహకరించారని పలువురు విమర్శిస్తున్నారు.

రాజకీయాలు జరిగాయి : అక్కసు వెళ్లగక్కిన ట్రంప్

ఈ ఏడాది నోబెల్ శాంతి పురస్కారం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చాలా ప్రయత్నించారు. ఎనిమిది యుద్ధాలను ఆపానని, ప్రజలను సంతోషంగా వుంచేందుకు ఎంతో కృషి చేశానని, అందువల్ల తనకు ఈ ఏడాది శాంతి బహుమతి రావాల్సిందేనని ఆయన గట్టిగా పట్టుబట్టారు. ఆ మేరకు ఆయన పరిధిలో చేయాల్సినదంతా చేశారు. తన ముందు నలుగురు అమెరికా అధ్యక్షులు శాంతి బహుమతి తీసుకున్నారని ఆయన పదే పదే గుర్తు చేశారు. శాంతి బహుమతి ఎంపికలో రాజకీయాలు జరిగాయని వైట్‌హౌస్ వ్యాఖ్యానించింది. శాంతి కన్నా రాజకీయాలు మిన్న అని నోబెల్ కమిటీ రుజువు చేసిందని పేర్కొంది. ఈ ఏడాది నోబెల్ శాంతి పురస్కారానికి ట్రంప్‌ను ఎంపిక చేయకుండా మచడోని ఎంపిక చేయడంపై నోబెల్ కమిటీ నిర్ణయాన్ని వైట్‌హౌస్ విమర్శించింది. "అధ్యక్షుడు ట్రంప్ శాంతి ఒప్పందాలు చేస్తున్నారు. యుద్ధాలు ఆపుతున్నారు. ప్రజల ప్రాణాలు కాపాడుతున్నారు. మానవత్వానికి నిలువెత్తు ప్రతీక ఆయన, కేవలం తన సంకల్పంతోనే పర్వతాలను కదిలించగల శక్తి ఆయన సొంతం ఆయనలా మరొకరు ఎన్నటికీ వుండరు." అంటూ వైట్‌హౌస్ ప్రతినిధి స్టీవెన్ చెయుంగ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

నోబెల్ స్ఫూర్తికి విరుద్ధంగా ట్రంప్ వ్యవహరిస్తున్నారు : నినా గ్రెగర్

దీనిపై ఓస్లో శాంతి పరిశోధనా సంస్థ అధినేత నినా గ్రెగర్ స్పందిస్తూ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రపంచ ఆరోగ్య సంస్థ నుండి అమెరికాను వైదొలగేలా చేశారని, 2015నాటి పారిస్ వాతావరణ ఒప్పందాల నుండి కూడా బయటకు వచ్చారని గుర్తు చేశారు. మిత్రపక్షాలతో సాగించిన వాణిజ్య యుద్ధాలు ఇవన్నీ కలిసి అల్‌ఫ్రెడ్ నోబెల్ అభీష్టానికి, సంకల్పానికి, స్ఫూర్తికి విరుద్ధంగా ట్రంప్ వ్యవహరించారని చెప్పారు. నోబెల్ రాసిన విల్లును చూసినట్లైతే, మూడు ప్రధాన రంగాల గురించి ఆయన నొక్కిచెప్పారని ఆమె తెలిపారు. శాంతికి సంబంధించిన విజయాలు : శాంతి ఒప్పందానికి మధ్యవర్తిత్వం అందులో ఒకటని చెప్పారు. ఇక రెండోది నిరాయుధీకరణకు కృషి చేయడం, మూడవది అంతర్జాతీయ సహకారానికి పాటు పడడమని తెలిపారు.

కార్పొరేట్లకు రెడ్ కార్పెట్

(మొదటిపేజీ తరువాయి)

సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ స్థాపించనున్న పారిశ్రామిక లాజిస్టిక్స్ హబ్ మొదటి దశ-1 కోసం ఎకరా రూ.80 లక్షల వంతున 20 ఎకరాల భూమిని కేటాయించారు. కర్నూలు కృష్ణగిరి మండలంలో ఆక్సెల్ ఇఎస్‌జి(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎఐ ఆధారిత పర్యావరణ పర్యవేక్షణ, డ్రోన్లు, సెన్సార్లు ఉత్పత్తికోసం ఇన్నోవేషన్ సెంటర్ కోసం ఎకరా లక్ష రూపాయల వంతున 80 ఎకరాలు కేటాయిస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. అనంతపురం జిల్లా గుడిపల్లి ఇండస్ట్రియల్ పార్కులో ఎకరా రూ.45.95లక్షలకు రేమండ్ గ్రూప్ అనుబంధ సంస్థలూన జెకె మైనిప్రెసిషన్ టెక్నాలజీ లిమిటెడ్‌కు 30 ఎకరాలను కేటాయించారు. ఇవి కాక పలు సంస్థలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేయనుంది.

ఏడు పర్యాటక ప్రాజెక్టులకు ఆమోదం:

అమరావతిలో సదర్న్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్‌కు 4స్టార్ హోటల్‌కు, శ్రీశైలంలో 3 స్టార్ హోటల్ (హిల్టన్ గార్డెన్ ఇన్‌బ్రాండ్)కోసం శ్రీ వెంకటేశ్వర లాడ్జ్ ప్రైవేట్ లిమిటెడ్, అమరావతిలో దసపల్లా హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 4స్టార్ హోటళ్ల నిర్మాణానికి భూమితో అవసరమైన ఇతర ప్రోత్సహకాలు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. విశాఖపట్టణం కొత్తవలస వద్ద మైరా బేవ్యూరిసార్ట్స్ అండ్ కన్వెన్షన్ సెంటర్ అభివృద్ధికి భూమి, ప్రోత్సహకాలు అందించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అరకు వ్యాలీలో విఎస్‌కె హోటల్స్ అండ్ రిసార్ట్స్ ఎల్ఎల్‌ఫికు ఈకో లగ్జరీ రిసార్ట్ అభివృద్ధికి ప్రోత్సాహకాలు, తిరుపతిలో ట్రైడెంట్ తిరుపతి లిమిటెడ్ అండ్ఓ బెరాయ్ (విలాస్) రిసార్టు అభివద్ధికి భూమి కేటాయింపు, విశాఖ బీచ్‌రోడ్డులో వరుణ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తాజ్ గేట్‌వే 5 స్టార్ డీలక్స్ కమ్ సర్వీస్ అపార్టుమెంట్‌గా తిరిగి అభివృద్ధి చేసేందుకు ప్రోత్సహకాలను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది.

దొనకొండ వద్ద రక్షణశాఖకు 1400 ఎకరాలు

ప్రకాశం జిల్లా దొనకొండ వద్ద రక్షణ మంత్రిత్వ శాఖ సార్వజనిక రంగసంస్థ భారత్ డైనమిక్స్‌లిమిటెడ్ స్థాపించనున్న ప్రొపెల్లెంట్ ఉత్పత్తి, ఆయుధ వ్యవస్థ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్ స్థాపించేందుకు 1400 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఈ ప్రాజెక్టు తయారీలో భాగంగా ప్రభుత్వ ఆధీనంలోని భూమిని1200ఎకరాల భూమిని ఎకరా రూ.7.73లక్షలకు, మిగిలిన భూమిని మార్కెట్ ధరకు అనుగుణంగా కేటాయించనున్నారు.

గ్రామ పంచాయతీలు పునర్ వర్గీకరణ

గ్రామ పంచాయతీలను ప్రస్తుత క్లస్టర్ విధానానికి భిన్నంగా స్వతంత్ర యూనిట్లుగా పునర్ వర్గీకరణ చేయాలన్న ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్రంలో 13,351 స్వతంత్ర యూనిట్లు ఏర్పాటు కానున్నాయి. ఆదాయాన్ని బట్టి పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా విభజించనున్నారు.



ఇజ్రాయిల్ దాష్టీకంపై అసెంబ్లీలో తీర్మానం

- తమిళనాడు సిఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై : గాజాలో ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ, అక్కడ శాంతి నెలకొనేలా భారత ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేస్తామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ప్రకటించారు. చెన్నైలో సిపిఎం ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాజకీయ విభేదాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు ఈ తీర్మానానికి మద్దతు ఇస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ తీర్మానం తమిళనాడు ప్రజల మనోభావాలను ప్రతిబింబిస్తుందని చెప్పారు. ఇజ్రాయిల్ విచక్షణారహిత దాడులు మొత్తం ప్రపంచ ప్రజల మనసులను కలచివేశాయని అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలను, ఐక్యరాజ్య సమితి సూత్రాలను ఉల్లంఘించిందన్నారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు యు. వాసుకి మాట్లాడుతూ మోడీ, నెతన్యాహు సైద్ధాంతిక స్నేహితులని విమర్శించారు. దేశ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ ప్రభుత్వం తలొగ్గిందని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ద్రవిడ కజగం అధ్యక్షుడు కె.వీరమణి, తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు కె.సెల్వపెరుతంగై, విసికె నాయకుడు థోల్, ఎంపి తిరుమల వలవన్, సిపిఐ, ఐయుఎంఎల్, వనియతనేయ మక్కల్ కట్చి, తమిళనాడు వాజ్వురిమైకట్చి తదితర పార్టీల నాయకులు హాజరయ్యారు.

వర్సిటీలో లాఠీఛార్జి

- లైంగిక వేధింపులపై భగ్గుమన్న పుదుచ్చేరి విద్యార్థులు
- ఆరుగురు విద్యార్థినులుసహా 24 మంది అరెస్టు





పుదుచ్చేరి వర్సిటీ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, (ఇన్‌సెట్‌లో) విద్యార్థిని ఈడ్చేస్తున్న పోలీసులు

పుదుచ్చేరి : పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో లైంగిక వేధింపులపై విద్యార్థిలోకం భగ్గుమంది. బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరుతూ పెద్దఎత్తున ఆందోళన నిర్వహించిన విద్యార్థులపై పోలీసులు పాశవికంగా లాఠీఛార్జి చేశారు. మహిళలని కూడా చూడకుండా విరుచుకుపడ్డారు. బూట్లతో తన్నడంతోపాటు జుట్టు పట్టుకుని ఈడ్చేశారు. ఆరుగురు విద్యార్థినులుసహా 24 మందిని అరెస్టు చేశారు. దీంతో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. ప్రొఫెసర్ తనతో అసభ్యంగా ప్రవర్తించాడని, నగ్న ఫొటోలు పంపించకపోతే ఇంటర్నల్ మార్కులు నిలిపివేస్తామని బెదిరిస్తున్నాడని ఇటీవల కారైకల్ క్యాంపస్‌కు చెందిన ఓ విద్యార్థిని ఆరోపించింది. ఆ వీడియో వైరల్‌గా మారింది. ఆ తరువాత సంబంధిత ప్రొఫెసర్‌పై చర్య తీసుకోవాలని లెఫ్టినెంట్ గవర్నర్‌కు మాజీ విద్యాశాఖ మంత్రి కమల కన్నన్ ఫిర్యాదు చేశారు. వర్సిటీ పరిధిలోని కాలాపేట్ క్యాంపస్‌లో ఓ ప్రొఫెసర్ తనను వివాహం చేసుకుంటానని మోసం చేశాడని రీసెర్చ్ స్టూడెంట్ ఒకరు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యాన పెద్దఎత్తున విద్యార్థులు గురువారం వర్సిటీ ప్రాంగణంలో మార్చ్ నిర్వహించారు. లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రొఫెసర్లను తొలగించాలని వైస్ ఛాన్సలర్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం చర్చల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు అంగీకరించారు. లిఖితపూర్వకంగా ఇవ్వాలని విద్యార్థులు కోరగా, అధికారులు నిరాకరించారు. విద్యార్థులు ఆందోళన కొనసాగిస్తుండటంతో పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో విరుచుకుపడ్డారు. శుక్రవారం కూడా విద్యార్థులు ఆందోళన కొనసాగించారు. వర్సిటీ అధికారుల తీరును నిరసిస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. పోలీసుల చర్యను ఖండిస్తూ సిపిఎం పుదుచ్చేరి రాష్ట్ర కార్యదర్శి ఎస్ రామచంద్రన్, డిఎంకె, విదుతలై చిరుతైగల్ నాయకులు... విద్యార్థి నాయకులతో కలిసి కలైవనన్ సీనియర్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. లైంగిక వేధింపులపై పోరాడుతున్న విద్యార్థులపై పోలీసులతో దాడి చేయించిన యూనివర్సిటీ యంత్రాంగం చర్యను ఖండించారు. వెంటనే నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మోసం వద్దు



రాజు, రమణ స్నేహితులు. ఇద్దరూ 10వ తరగతి చదువుతున్నారు. ఒకరోజు స్కూలుకి వెళుతున్న రాజుతో వాళ్ల నాన్న సుబ్బయ్య, 'ఒరేయ్! పాఠశాల నుంచి వచ్చేటప్పుడు తాతయ్యకు మందులు తీసుకుని రా' అని ఒక చీటీ ఇచ్చి, డబ్బులు ఇచ్చారు. రాజు 'సరే' అని బయల్దేరాడు. రాజు, రమణ స్కూలుకి బయలుదేరారు. దారిలో రాజు, రమణతో 'ఒరేయ్! ఈరోజు పాఠశాలకు డుమ్మా కొట్టేసి, సినిమాకి వెళ్దామా?' అని అడిగాడు. 'సినిమా టికెట్లకు డబ్బులు ఉండాలి కదరా!' అని రమణ అడిగాడు. 'నా దగ్గర ఉన్నాయి లే.. పద సినిమాకి వెళ్దాం' అని ఇద్దరూ సినిమాకి వెళ్లారు.

సినిమా అయ్యాక ఇంటికి వచ్చేసి, 'నాన్న! పాఠశాలలో ఎక్కడో డబ్బులు పడిపోయాయి. నేను రమణ చాలా సేపు వెతికాం. దొరకలేదు. అందుకే తాతయ్య మందులు తేలేదు' అని అబద్ధం చెప్పాడు. రమణకి రాజు ఆడిన అబద్ధం విని గుండె దడదడ లాడింది. రాజు అబద్ధం చెప్పడమే కాకుండా తనను సాక్ష్యంగా కూడా పెట్టాడు. ఇంతలో ఆ దారి గుండా వస్తున్న వీరితో పాటు పట్టణంలో చదువుతున్న రాణి 'రాజు, రమణ ఈరోజు మీ ఇద్దరూ పాఠశాలకు రాలేదు కదా! పుస్తకాల సంచులతో ఎక్కడికి వెళ్లారు?' అని అడిగింది. సుబ్బయ్యకి విషయం అర్థమైంది. అప్పుడు రమణ ఏడుస్తూ 'అంకుల్, వీడే నా దగ్గర డబ్బులు ఉన్నాయి. సినిమాకి వెళ్దామని చెప్పాడు' అని అసలు సంగతి చెప్పాడు. సుబ్బయ్య పిల్లలిద్దరినీ కూర్చోబెట్టి, 'చూడండి పిల్లలూ... మీరు చక్కగా చదువుకోవాలని పట్టణంలో బడికి పంపుతున్నాం. మీరేమో మా నమ్మకాన్ని వమ్ము చేసి షికార్లు చేయాలని అనుకుంటున్నారు. మీరు మమ్మల్ని మోసం చేస్తున్నారు అనుకుంటున్నారు. కానీ మిమ్మల్ని మీరే మోసం చేసుకుంటున్నారు. ఈ పద్ధతి మీ భవిష్యత్తును పాడు చేస్తుంది. అర్థం చేసుకుని మసులకోండి' అని హితవు చెప్పారు. రాజు, రమణ తమ తప్పును క్షమించమని, ఇంకెప్పుడూ అలా చేయమని ప్రాధేయపడ్డారు. వారిలో వచ్చిన మార్పును చూసి సుబ్బయ్య సంతోషించాడు.

- మొర్రి గోపి,
కవిటి, శ్రీకాకుళం జిల్లా, 88978 82202.

కుందేలు - తాబేలు



పరుగు పందెంలోన పాల్గొంది తాబేలు
శశముతో పోటీకి సయ్యంది తాబేలు

వడివడిగ కుందేలు పరుగు లంఘించగా
నత్తలా నెమ్మదిగ నడిచింది తాబేలు

కుందేలు మధ్యలో కునుకింది కాసేపు
గమ్యానికెదురుగా కదిలింది తాబేలు

పూర్తిగా నిద్రలో మునిగింది కుందేలు
నేరుగా గమ్యాన్ని చేరింది తాబేలు


నిలకడగ కృషి చేస్తె గెలుపు నీదే విశ్వా
సత్యాన్ని లోకాన చాటింది తాబేలు

- గొట్టాపు శ్రీనివాస రావు, సాలూరు,
95420 19064.

నేను గీసిన బొమ్మ



- ఎస్‌కె.రెహనా,
ఎంపిఎపిబిసిడబ్ల్యు
ఆర్, దుద్దుకూరు.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com





'కృతజ్ఞతలు' చెప్పడం చాలా కృతకంగా మారిపోయిన సందర్భాలు ఎన్నో వస్తుంటాయి. 'థాంక్స్' అనడం సర్వసాధారణం అయిపోయిన రోజులివి. అయితే ఇటీవల సోషల్ మీడియాలో ఓ చిన్న పిల్లవాడు 'థాంక్ యు రేష్మి అండ్ హర్ ఫ్రెండ్స్ ఫ్రమ్ కేరళ ఇండియా' అన్న ప్లకార్డు పట్టుకున్న ఫోటో బాగా వైరల్ అయ్యింది. కేరళలో ఉన్న రేష్మికి, ఆమె స్నేహితులకి ఆ బాలుడు చెప్పిన 'థాంక్స్'.. కేవలం పదం కాదు.. అది మానవత్వానికి చిహ్నం. అంతకుమించి దయార్ధ్ర హృదయానికి ప్రతీక. ఎందుకంటే అమాయకులు, పిల్లలు, మహిళలు లక్ష్యంగా ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడి చేసిన 'గాజా' ఆ పిల్లవాడు ఉంటున్న ప్రదేశం. సుదీర్ఘ దాడుల సమయంలో దక్షిణ గాజాకి తరలించబడిన పాలస్తీనా కుటుంబాలు, పిల్లలు ఆకలితో అలమటించడం చూసి తట్టుకోలేని రేష్మి, వాళ్లు తినడానికి, తాగడానికి కొన్ని రొట్టెలు, కాసిన్ని నీళ్లు అందించారు. ఈ చిన్న సాయం చేయడానికి తను ఎంతో శ్రమ పడింది. అవమానాలు భరించింది. అయినా తన ప్రయత్నం ఆపలేదు. లక్ష్యం నెరవేరిన రోజున 'మనిషంటేనే మానవత్వం' అని ఎంతో ఉద్వేగంగా రేష్మి మాట్లాడింది. ప్రస్తుత పరిస్థితుల్లో త్వరలో గాజాలో శాంతి వాతావరణం నెలకొంటుందని ప్రపంచమంతా ఆశపడుతోంది. ఈ సమయంలో అక్కడి దీనపరిస్థితులకి తల్లడిల్లిన రేష్మి చేసిన కృషిని అందరూ తెలుసుకోవాలి.

మానవత్వం నిండిన మనుషులు ...

కేరళలోని కొచ్చిలో శ్రీరేష్మి నివసిస్తోంది. ఫిలాసఫీలో గ్రాడ్యుయేట్ చేసిన రేష్మి, 'కూట్టు' అనే స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు. ఈ సంస్థ ద్వారానే ఆమె, 250 పాలస్తీనా కుటుంబాలకి 3000 లీటర్ల నీటి ట్యాంకుని, ఆహార ఉత్పత్తులని పంపించింది. ఎక్కడో కేరళ నుంచి దక్షిణ గాజాకి ఈ సాయం అందించడం అంత ఆషామాషీ కాదు. కానీ అక్కడ నీటి అవసరం చాలా వుంది. దక్షిణ గాజాకి తరలించబడిన కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతంలో నీటిప్రవాహాలు పూర్తిగా కలుషితమయ్యాయి. ఫలితంగా కామెర్లు, విరేచనాలు, చర్మవ్యాధులతో అక్కడి పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. వారికి రోజుకు 6000 లీటర్ల పరిశుభ్రమైన నీరు కావాలి. కానీ ఆ సాయం వారికి అందడం లేదు.

ఈ పరిస్థితుల్లో తను పడిన మానసిక వేదన గురించి రేష్మి ఇలా చెబుతోంది. 'తినడానికి తిండి లేక, తాగడానికి నీరు దొరక్క ఆ పిల్లలు పడుతున్న బాధలు చూసి రాత్రుళ్లు నిద్రపట్టేది కాదు. ఉన్నపళంగా ఆ పిల్లలను 'నాతో ఇక్కడికి తీసుకొచ్చేసేయాలి' అన్నంత ఆవేదనగా ఉండేది. నీళ్ల ట్రక్కు, ఆహార ఉత్పత్తులు ఆ ప్రాంతానికి చేరిన రోజు అక్కడ దువా మరియం అనే ఏడాది పాప, తన మొదటి పుట్టినరోజు జరుపుకోవాలి. నేను పంపిన సాయం ఆ పసిదానికి చేరింది. ఎంతో సంతోషంతో అవన్నీ ముందేసుకుని చిరునవ్వులు చిందిస్తున్న ఫొటోని నాకు పంపారు. అది చూసి నాకు కన్నీళ్లు ఆగలేదు' అంటున్న రేష్మి పాలస్తీనా కుటుంబాలకి ఈ సాయం చేసేందుకు అంతర్జాతీయ సహాయ బృందంలో స్వచ్ఛంద సేవకురాలిగా పనిచేస్తున్న తన స్నేహితురాలు లెస్లీ సాయం తీసుకుంది.

కేరళలో పుట్టి పెరిగిన రేష్మి, ఇప్పుడు మాత్రమే కాదు. గతంలో అనేక సహాయ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న అనుభవం ఉంది. వయనాడ్ వరదలు, కోవిడ్ విలయం ఇలా ప్రతి విపత్తులో తన చుట్టూ ఉన్న వారి కోసం రేష్మి తన వంతు సాయం చేస్తున్నారు. అయితే ఇప్పుడు గాజా పిల్లలకి చేసిన సాయం మాత్రం వాటన్నింటికంటే భిన్నమైనది. ఎందుకో ఆమె ఇలా చెబుతోంది. 'ఆహారం, నీరు నిరాకరించడం మానవ హక్కుల ఉల్లంఘన. భారతదేశంలో ప్రస్తుత పరిస్థితులు నేరుగా గాజాకి సాయం చేసేందుకు అనుకూలంగా లేవు. కానీ నేను అలా చూస్తూ ఊరుకోలేకపోయాను.

విదేశాల్లో ఉన్న వారికి సాయం చేయడం ఇదే మొదటిసారి. అయినా వెనుకంజ వేయలేదు. గాజాలో ఉన్న స్వచ్ఛంద సంస్థలు, అంతర్జాతీయ సంస్థలను ఎన్నింటినో సంప్రదించాను. అన్ని వైపులా సవాళ్లు ఎదురయ్యాయి. సంస్థలని గుర్తించడం ఒక ఎత్తయితే, ముఖ్యంగా బాధితులకి నీళ్లు, ఆహారం సరఫరా చేసేవారు ముందుకురావడం చాలా కష్టమైంది. ఎట్టకేలకి ఓ ట్రక్కు డ్రైవరు మా ప్రతిపాదనకి అంగీకరించాడు. నీళ్లు, ఆహారం ఆ కుటుంబాలకి చేరింది అన్న వార్త విన్న తర్వాతే నేను గట్టిగా ఊపిరి పీల్చుకోగలిగాను. అప్పటివరకు ఎంతో ఆందోళన చెందాను'. అని చెప్పిన రేష్మికి ఆ తరువాత పాలస్తీనా మహిళలు, పిల్లలు పంపినా కృతజ్ఞతా సందేశాలు, నీళ్ల డబ్బాల దగ్గర కూర్చొన్న పిల్లల ఫొటోలతో తన సోషల్ మీడియా ఖాతా నిండిపోయింది.

ఇంత సాయం చేసినా దీని గురించి చాలా నిగర్వంగా రేష్మి ఇలా అంటోంది : 'ఇది కేవలం దాతృత్వం కాదు. మానవత్వానికి చిహ్నం. మనం మనుషులం. మనుషులంటే మానవత్వం ఉట్టిపడాలి. నేను చేసింది అదే. భవిష్యత్తులోనైనా పాలస్తీనా పరిస్థితులు చక్కబడాలి. ఆ పిల్లలు స్వేచ్ఛగా, సంతోషంగా ఎదగాలి' అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లుగా ప్రతిరోజూ సంఘీభావం..

పాలస్తీనా ప్రజలకి జరుగుతున్న అన్యాయాన్ని, దారుణాలని తన దేశ ప్రజలకు చేరవేసేందుకు 77 ఏళ్ల వ్యక్తి రెండేళ్లుగా ఢిల్లీ వీధుల్లో తిరుగుతున్నాడు. ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైర్ అయిన ఈ పెద్దాయన రోజు, కొన్ని కరపత్రాలు పట్టుకుని వీధుల్లోకి వెళ్లడంతో మొదలవుతుంది. ఉదయం ఇంటినుండి బయల్దేరేటప్పుడు భుజానికి ఓ గుడ్డ సంచి, అందులో జాతి నిర్మూలన గురించిన కరపత్రాలు వేసుకుని ఆయన బయల్దేరతారు. దారిలో కనిపించిన వారికి వాటిని పంచుతూ, గాజా పౌరులకి రెండేళ్లుగా జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తారు. ఏకపక్షంగా ఇజ్రాయిల్ చేస్తున్న దారుణాన్ని తన పదునైన మాటలతో ఎండగడతారు. బస్టాపులు, కాలేజీలు, వీధులు ఎక్కడైనా జనాలు గుమిగూడిన చోట ఆయన ఆగాల్సిందే.. సంఘీభావం తెలపాల్సిందే..

కొంతమంది ఆయన చెప్పే మాటలను శ్రద్ధగా వింటారు. మరికొంతమంది 'గాజాకి నువ్వెందుకు సంఘీభావం తెలుపుతున్నావు?' అని ఎదురు ప్రశ్నిస్తారు. అలా ఒకసారి ఓ అపరిచిత వ్యక్తితో త్రిపాఠికి ఎదురైన అనుభవం ఇది. అపరిచిత వ్యక్తి ... 'గాజా కోసం నీకెందుకు బాధ?' అని అడిగినప్పుడు ఎంతో సామరస్యంగా.. 'ఎందుకంటే అక్కడ నీకులాంటి ప్రజలే ఉన్నారు' అని త్రిపాఠి సమాధానం చెప్పారు. అయినా ఆ అపరిచిత వ్యక్తి వినలేదు. కోపంతో ఊగిపోతూ మీదిమీదికి వస్తూ.. 'అక్కడ ఏదైనా అణచివేత జరుగుతోందా?' అని గట్టిగట్టిగా అరుస్తూ వచ్చాడు. అప్పుడు కూడా త్రిపాఠి ఎంతో శాంతంగా.. 'అక్కడ అణచివేతకి మించిన దారుణం జరుగుతోంది. అయినా నీలాంటి వాళ్లు ఈ దేశానికి ప్రమాదం' అని అన్నారు. అప్పుడు ఆ అపరిచిత వ్యక్తి మరింత ఊగిపోతూ.. 'మేము ప్రమాదం కాదు.. మేమే నిజమైన భారతీయులం. ప్రమాదకారులు మీరు.. ఎవరైతే గాజా కోసం బాధపడుతున్నారో వారు ప్రమాదకారులు' అంటూ ఆ వ్యక్తి చాలా కోపంగా చేతి



వ్రేళ్లు గాల్లో ఊపాడు.

ఇన్ని అవమానాలు పడినా, బెదిరించినా త్రిపాఠి తన దినచర్యని మార్చలేదు. రెండేళ్లుగా విధిగా వీధుల్లో గాజాకి సంఘీభావంగా ప్రచారం చేస్తూనే ఉన్నారు. దేశంలో నెలకొన్న పరిస్థితులు గురించి త్రిపాఠి ఇలా చెప్పారు.

'ఒకప్పుడు భారతదేశం పాలస్తీనాకి మద్దతుగా ఉండేది. మోడీ అధికారంలోకి వచ్చాక ఇజ్రాయిల్‌కి మన దేశాన్ని దగ్గర చేశారు. నా అభిప్రాయం ఏంటంటే ఇక్కడ ప్రభుత్వం మారాలి. ఎందుకంటే ఇజ్రాయిల్, పాలస్తీనా ప్రభుత్వాలతో మాట్లాడేది ప్రభుత్వమే' అంటున్న త్రిపాఠి, పాలస్తీనీయుల పట్ల పాలకులు వ్యవహరిస్తున్న తీరుని ఎండగట్టారు.

వీధుల్లో కరపత్రాలు పంచుతున్న త్రిపాఠిని ఒకసారి పోలీసులు అడ్డుకున్నారు కూడా. త్రిపాఠి గురించి ఆయన కూతురు రాఖీ ఏం చెబుతున్నారంటే.. 'రానురాను దేశంలో మత విద్వేష శక్తులు పెరుగుతున్నాయని నాన్న ఎప్పుడూ కలత చెందుతారు. అందుకే ఈ వయసులో కూడా లేని శక్తిని కూడదీసుకుని మరీ వీధుల్లో సంఘీభావ ప్రచారం చేస్తున్నారు. ఆయన్ని చూసి నేను చాలా గర్వంగా ఉన్నాను' అని చెప్పారు. ఈ సవాళ్ల మధ్య త్రిపాఠి ఏమంటున్నారంటే.. 'ఇక్కడ కొంతమంది ఏమనుకుంటున్నారంటే.. నేను మాట్లాడడం ఆపేయాలి. కానీ నా ప్రాణం ఉన్నంత వరకు అది సాధ్యం కాదు. నా శరీరం, నా ఆత్మ, నా మనసు అన్యాయానికి వ్యతిరేకంగా తిరుగుతాయి. దాన్ని ఎత్తిచూపాలని నేను ఉబలాటపడతాను. నా దేశ ప్రజలు కూడా ఆ భావంలో ఉండాలని కోరుకుంటాను. ఓ నా దేశ ప్రజలారా.. దయచేసి మీరు నాతో ఉండండి. ఎక్కడ అణచివేత, విధ్వంసం జరుగుతుందో అక్కడ మీ గళాలు విప్పండి. అందుకోసమే నేను ఇదంతా చేస్తున్నాను' అంటున్నారు.

ఆయన ఇంకా ఇలా మాట్లాడారు...: 'పాలస్తీనాలో ఉన్న నా స్నేహితులు ఇప్పుడు చాలా దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. వాళ్లని బయటపడవేసే పరిష్కారం నా దగ్గర లేదు. కానీ వాళ్ల స్ఫూర్తిని నేను గౌరవిస్తాను. మానవత్వానికి చిహ్నాలుగా ఇవాళ గాజాలో నా స్నేహితులు ఎంతోమంది ఉన్నారు. వాళ్లంతా నా హృదయానికి ఎంతో దగ్గరివారు' అంటున్నారు.

కేరళ జట్టు కెప్టెన్‌గా అజారుద్దీన్

తిరువనంతపురం: రంజీ ట్రోఫీ 2025-26 సీజన్ కోసం ఒక్కో జట్టు తమ తమ జట్లను ప్రకటిస్తున్నాయి. తాజాగా కేరళజట్టు తమ జట్టును ప్రకటించగా.. అంతకుముందే ముంబయి జట్టు తమ జట్టును ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. కెప్టెన్‌గా మహ్మద్ అజారుద్దీన్, బాబా అపరాజిత్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. వికెట్ కీపర్ కోటాలో టీమిండియా బ్యాటర్ సంజు శాంసన్ వికెట్ కీపర్ కోటాలో కేరళ జట్టుకు నియమితులయ్యాడు. మిగిలిన వారంతా కొత్త ముఖాలే. ఎలైట్ గ్రూప్-బిలో కేరళతో పాటు కర్ణాటక, పంజాబ్, సౌరాష్ట్ర, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛండీగడ్, గోవా జట్లు ఉన్నాయి. గాయం కారణంగా పేసర్ బసిల్ థంబి శిక్షణా శిబిరానికి హాజరుకాలేదు.

కేరళ జట్టు: అజారుద్దీన్(కెప్టెన్), అపరాజిత్(వైస్ కెప్టెన్), సంజు శాంసన్,రోహన్, కున్నుమోల్, విశాల్ గోవింద్, అక్షయ్ చంద్రన్, సచిన్ బేబి, సాల్మన్ నిజర్, నిదీశ్, బసిల్, ఈడెన్ ఆపిల్, అహ్మద్, షాన్ రోజర్/అభిషేక్.

ముంబయి జట్టు: శార్దూల్ ఠాకూర్(కెప్టెన్), ఆయుశ్ మాత్రే, ఆకాశ్ ఆనంద్ (వైస్ కెప్టెన్), హార్దిక్ తమోర్ (వికెట్ కీపర్), సిద్దేశ్ లాడ్, అజింక్యా రహానే, సర్ఫరాజ్ ఖాన్, శివం దూబే, షామ్స్ ములానీ, తనుష్ కోటియన్, దేశ్‌పాండే, సిల్వెస్టర్ డిసౌజా, ఇర్ఫాన్ ఉమైర్, ముషీర్ ఖాన్, అఖిల్ హెర్వాడ్కర్, రాయ్‌స్టాన్ డియాస్.

న్యూజిలాండ్ బోణి

బ్రూక్, డెవిన్ అర్ధసెంచరీలు
బంగ్లాదేశ్‌పై 100పరుగుల తేడాతో గెలుపు



గౌహతి: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ జట్టు బోణీ కొట్టింది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా చేతిలో ఓడిన న్యూజిలాండ్ జట్టు శుక్రవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై 100 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 227పరుగులు చేయగా.. అనంతరం బంగ్లాదేశ్‌ను ..39.5ఓవర్లలో 127పుగులకే ఆలౌట్ చేసింది. దీంతో ఈ టోర్నమెంట్‌లో న్యూజిలాండ్ జట్టు తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. ఛేదనలో భాగంగా బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ ఫాతిమా ఖాతూన్(34), రెబయా ఖాన్(24), నహిదా అక్తెర్(17) మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు. న్యూజిలాండ్ బౌలర్లు జెస్ కెర్ర్, తహుహుకు మూడేసి, రోసెమెనికి రెండు, అమేలియ కెర్ర్, కర్సన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు శుభారభం దక్కలేదు. ఓపెనర్ జార్జియా ప్లిమ్మర్(4)ను రబేయా ఖాన్ ఔట్ చేసింది. ఆ తర్వాత సూజీ బేట్స్(29) సైతం నిరాశపరచగా.. అమేలియా కేర్ ఒక్క పరుగుకే బౌల్డ్ అయింది. దాంతో.. 38 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ న్యూజిలాండ్‌ను బ్రూక్ హల్లిడే(69) సమయోచితంగా ఆడింది. కెప్టెన్ సోఫీ డెవిన్(63)తో కలిసి బ్రూక్.. సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పింది. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ఫాహిమా ఖాతూన్ విడదీసింది. జోరుమీదున్న హల్లిడేను ఆమె స్లో బాల్‌తో బోల్తా కొట్టించింది. క్యాచ్ అందుకోవడంతో నాలుగో వికెట్ 112 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. హల్లిడే వికెట్ పడడంతో జట్టుకు పోరాడగలిగే స్కోర్ అందించే బాధ్యత డివైన్ తీసుకొని.. రబెయా వేసిన ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లు బాదింది. కానీ, తర్వాతి బంతిని సిక్సర్ కొట్టబోయి బౌల్డయ్యింది. బంగ్లా బౌలర్లలో రబెయా ఖాన్‌కు మూడు వికెట్లు పడగొట్టింది.

వన్డే ప్రపంచకప్‌లో నేడు.. ఇంగ్లండ్ మహిళలు × శ్రీలంక మహిళలు (వేదిక: కొలంబో; మ.3.00గం॥లకు)

తొలి రోజు టీమిండియాదే..!

- డబుల్ సెంచరీకి చేరువలో జైస్వాల్
- సాయి సుదర్శన్ అర్ధసెంచరీ
- భారత్ 318/2




న్యూఢిల్లీ: రెండో టెస్టులోనూ టీమిండియా బ్యాటర్లు కదం తొక్కారు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ భారీ సెంచరీకి తోడు సాయి సుదర్శన్ అర్ధసెంచరీతో రాణించడంతో టీమిండియా భారీస్కోర్ దిశగా పయనిస్తోంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాను తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు దూకుడుగా ఆడారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ శతకంతో మెరవగా.. సాయి సుదర్శన్ మెరుగైన ప్రదర్శన చేశాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా 2 వికెట్ల నష్టానికి 318 పరుగులు చేసింది. భారత బ్యాటర్లను కట్టడి చేయడంలో మరోసారి విండీస్ బౌలర్లు విఫలమయ్యారు. యువ ఓపెనర్ జైస్వాల్-కెఎల్ రాహుల్ కలిసి తొలి వికెట్‌కు 58పరుగులు జతచేశారు. ధాటిగా ఆడే క్రమంలో జైస్వాల్(38) ఔటైనా... జైస్వాల్ ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. 145 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్న జైస్వాల్.. తొలిరోజు ఆట ముగిసే సరికి 173 పరుగులతో క్రీజ్‌లో నిలిచి డబుల్ సెంచరీ దిశగా పయనిస్తున్నాడు. టెస్టు కెరీర్‌లో అతడికిది ఏడో శతకం. మూడో సెషన్‌లో అతడు 150 పరుగుల స్కోరుకు చేరుకున్నాడు. అతడి ఇన్నింగ్స్‌లో 22 ఫోర్లు ఉన్నాయి. ఇక మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ (38) వారికన్ బౌలింగ్‌లో స్టంపౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత వచ్చిన సాయి సుదర్శన్(87) రాణించాడు. శతకానికి చేరువలో వారికన్ బౌలింగ్‌లోనే ఎల్బీగా ఔటయ్యాడు. తొలిరోజు ఆట మగిసే సమయానికి జైస్వాల్-కెప్టెన్ వుభ్‌మన్ గిల్ 20 పరుగులతో క్రీజ్‌లో నిలిచారు. ఇక విండీస్ బౌలర్లు వికెట్లు తీయడంలో మరోసారి ఇబ్బందిపడ్డారు. తొలి రోజు వచ్చిన రెండు వికెట్లు కూడా స్పిన్నర్ వారికన్ తీసినవే.

స్కోర్‌బోర్డు...

ఇండియా తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బ్యాటింగ్) 173, కెఎల్ రాహుల్ (స్టంప్)టెవిన్ (బి)వారికన్ 38, సాయి సుదర్శన్ (ఎల్‌బి)వారికన్ 87, శుభ్‌మన్ (బ్యాటింగ్) 20, అదనం 0. (90 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 318పరుగులు. **వికెట్ల పతనం:** 1/58, 2/251 **బౌలింగ్:** సీల్స్ 16-1-59-0, ఫిలిప్ 13-2-44-0, గ్రీవ్స్ 8-1-26-0, పియర్రీ 20-1-74-0, వారికన్ 20-3-60-2, ఛేస్ 13-0-55-0.

8 గంటల పని.. సూపర్‌స్టార్లకేనా..!



'ఎన్నో ఏళ్లుగా ఇండస్ట్రీలో చాలామంది హీరోలు 8 గంటలు మాత్రమే పని చేస్తున్నార'ని బాలీవుడ్ నటి దీపికా పదుకొణె అన్నారు. వర్కింగ్ అవర్స్ కారణంగా ఆమె భారీ ప్రాజెక్టుల నుంచి వైదొలిగారని వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. దీనిపై తాజాగా ఆమె స్పందించారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు పంచుకున్నారు. 'ఒక ఆత్మాభిమానం ఉన్న నటిగా నన్ను ఇబ్బంది పెట్టే వాటిని అంగీకరించను. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో చాలామంది సూపర్‌స్టార్‌లు, అగ్ర హీరోలు ఎన్నోఏళ్లుగా 8 గంటలు మాత్రమే పని చేస్తున్నారు. ఇదేం రహస్యం కాదు. కానీ, ఇన్నేళ్లలో ఈ విషయం ఎప్పుడూ వార్తల్లో నిలవలేదు. ఇప్పుడు వాళ్ల పేర్లు చెబితే మొత్తం విషయం తప్పుదోవ పడుతుంది. అందుకే వాళ్ల పేర్లు చెప్పాలనుకోవడం లేదు. చాలామంది సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే షూటింగ్‌లో పాల్గొంటారు. వారాంతాల్లో పని చేయరు' అని తెలిపారు. ఈ విషయంపై మాట్లాడినందుకు నేను చాలాసార్లు ఇబ్బందిపడ్డాను. అయితే ఇది కొత్తేం కాదు. ఎన్నో పోరాటాలను నిశ్శబ్దంగా ఎదుర్కొన్నాను. కానీ, కొన్ని కారణాల వల్ల అవి బహిరంగంగా మారతాయి. నేనెప్పుడూ దేనిపైనా స్పందించను. నిశ్శబ్దంగా యుద్ధాలను చేయడం మాత్రమేనాకు తెలుసు. అలా చేస్తేనే అది గౌరవంగా, హుందాగా ఉంటుంది' అని దీపిక సమాధానమిచ్చారు.

'బాహుబలి' రాజమౌళి



రాజమౌళి రూపొందించిన 'బాహుబలి' చిత్రం ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాలలో టాప్ 5లో కొనసాగుతోంది. ఈ సినిమాను మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా వచ్చి ఇటీవల 10 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మూవీ రెండు భాగాలను కలిపి ఒకే పార్ట్‌గా అక్టోబర్ 31న రీ రిలీజ్ చేయబోతున్నారు. అయితే శుక్రవారం రాజమౌళి పుట్టినరోజు కావడంతో ఆయనకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ.. బాహుబలి టీమ్ తాజాగా ఒక స్పెషల్ వీడియోను సోషల్‌మీడియాలో షేర్ చేసింది. ఈ వీడియోలో బాహుబలిని ప్రపంచ స్థాయి సినిమాగా మలచడానికి రాజమౌళి చేసిన కృషిని చూపించారు.

అక్టోబరు 24న 'ఎర్రచీర'



రాజేంద్ర ప్రసాద్ మనవరాలు బేబీ సాయి తేజస్విని కీలక పాత్ర పోషించిన సినిమా 'ఎర్రచీర'. సుమన్ బాబు దర్శకత్వం వహిస్తూ ఓ కీలక పాత్రను ఇందులో పోషించారు. బేబీ డమరి సమర్పణలో ఎన్.వి.వి. సుబ్బారెడ్డి (సుభాష్), సిహెచ్.సుమన్ బాబు ఈ సినిమాను నిర్మించారు. మదర్ సెంటిమెంట్, హారర్, యాక్షన్ బ్యాక్ డ్రాప్‌లో రూపుదిద్దుకున్న ఈ సినిమాకు 'ఎ' సర్టిఫికెట్ లభించింది. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం ప్రకటించింది. అక్టోబర్ 24న విడుదల చేయబోతున్నట్లు నిర్మాత సుబ్బారెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో చిత్రబృందం చిత్రవిశేషాలు పంచుకున్నారు. 'ఈ చిత్రంలో తల్లీకూతుళ్ళకు సంబంధించిన భావోద్వేగ సన్నివేశాలు ఉన్నాయి. అందువల్ల ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఈ సినిమా తప్పకుండా మెప్పిస్తుంది. అయితే హారర్ కంటెంట్ ఎక్కువగా ఉన్న కారణంగా 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చారు. హృద్రోగులు తగిన జాగ్రత్తలు తీసుకుని ఈ సినిమాకు వస్తే మంచిది' అని సుమన్ అన్నారు. ఈ చిత్రంలో శ్రీరామ్, కమల్ కామరాజు, కారుణ్య చౌదరి, అయ్యప్ప పి శర్మ, సురేశ్ కొండేటి, రఘుబాబు ఉన్నారు.

'ఫంకీ' టీజర్ విడుదల

విశ్వక్ సేన్ నటిస్తోన్న తాజా చిత్రం 'ఫంకీ' ఈ చిత్రానికి అనుదీప్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను చిత్రబృందం విడుదలచేసింది. ఈ చిత్రంలో కయాద్ లోహర్ హీరోయిన్‌గా కనిపించనుంది. టీజర్ చూస్తే అనుదీప్ కామెడీ మార్క్ కనిపిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ సినిమాని నిర్మిస్తున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68